# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

ఏప్రియల్ 2026



2026 జనవరి 20 వ తేదీన రామచంద్రాపురంలో శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో జరిగిన సత్సంగ దృశ్యములు









2026 జనవరి 21 వ తేదీన ద్రాక్షారామము, భీమేశ్వర ఆలయంలో జరిగిన చండీయాగ మహోత్సవ సత్సంగ సభలో పాల్గొన్న శ్రీ మాతాజీ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 8
పేజీలు 44
ఏప్రియల్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట....................................... ................. 8
ఓం పూషదంతభిదే నమః..... ..................................9
సహవాస దోషం ..........................................11
నాదోపాసన ...................................................12
భగవద్గీత సాధన దీపిక ...............................14
స్వామి దయానంద మహరాజ్.... ...................16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ........ 18
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 20
నారద భక్తి సూత్రములు ................ ..............22
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....24
ఇతరులకు ప్రవేశము లేదు. .......................25
శ్రీ బాబూజీతో నా ప్రయాణం .................27
బాబూజీతో నా అనుభవాలు.....................31
నిరీక్షణ ..................................................................33
శ్రీ గురుగీత ........................................... ........35
గురుకృప ........................................ .............37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

11. *కామవ్యాఘ్రంబు క్రోధసర్పంబును*
*లోభవృకంబు మోహభల్లూకంబు*
*జ్ఞనదావాగ్నియె సర్వమృగనాశంబు*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: మనందరం అజ్ఞానము, లేక అవిద్య అనబడే అరణ్యంలో జీవిస్తున్నాం. ఇక్కడ మాటువేసి, అదనుచూసి, పంజాదెబ్బ కొట్టే పులివంటి కామము, తోకత్రొక్కిన త్రాచులా బుసకొట్టే క్రోధము, ఎంత తిన్నా కడుపునిండని తోడేలువంటి లోభము, పట్టుకుంటే వదిలిపెట్టని ఎలుగుబంటిలాంటి మోహము, మత్తెక్కి విచ్చలవిడిగా ప్రవర్తించే ఏనుగులాంటి మదము, ఇతరుల అభివృద్ధిని చూసి ఓర్వలేక తగవులు పెట్టే నక్కజిత్తుల మత్సరము ఇలాంటి ఎన్నో క్రూరమృగాలు సంచరిస్తూ అడుగడుగునా ఆపదలు కలుగజేస్తూ ఉంటాయి. అడవిలో ఒక్కొక్క క్రూరమృగాన్ని చంపుకుంటూ ప్రయాణం సాగించాలంటే ఎంత కష్టం? అలాగే ఈ దుర్గుణాలను కూడా ఒక్కొక్కటిగా జయించడం సాధ్యం కాదు. అదే ఆ అడవికి నిప్పు పెట్టేస్తే అన్ని మృగాలు ఒక్కసారిగా నశించిపోతాయి. అలాగే ఈ అవిద్యారణ్యాన్ని జ్ఞాన దావాగ్నితో దహించివేస్తే మనలోని గుణాలు, కర్మలు వాసనలు అన్నీ ఆ జ్ఞానాగ్నిలో భస్మమయిపోతాయి.



1) మళ్ళీ విరిచి తిరిగి కట్టాలి అని వైద్యులు చెప్పిన చెయ్యి ఏ శస్త్రచికిత్స లేకుండా ఎలా సరి అయ్యింది?
2) నరికిన చేతులు మళ్ళీ ఎలా అతుక్కున్నాయి?
3) దొంగలు తమను శిక్షించబోయిన వారిని మరలా చూడాలని ఎందుకనుకున్నారు?
4) వారం లేని రోజు ఏది?
5) శిష్యుడు అన్ని చీమలను ఎందుకు చంపాడు?
6) అనుభవానికి పాండిత్యానికి తేడా ఏమిటి?
7) సూర్యుడికి పళ్ళు ఎందుకు లేవు?

*సమాధానాలు లోపలి పేజీలలో...........................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

29-10-1981

ఈ రోజు రాత్రి 9గం॥ శ్రీ బాబు దర్శనం యిచ్చారు. ఒక సీసాతో నువ్వుండలు తీసుకు వచ్చారు. భక్తులందరికి పెట్టారు. పురుషోత్తంగారికి ఇస్తూ, 'ఎలా వున్నాయండీ? బాగున్నాయా?' అని అడిగారు శ్రీ బాబూజీ. పురుషోత్తంగారు 'బాగున్నాయి' అని చెప్పారు. "రామనామంకన్నా బాగున్నాయా?" మళ్ళీ అడిగారు శ్రీబాబూజీ. ఇంకా మాట్లాడుతూ 'ఆ రుచి తెలిస్తే ఇవి బాగున్నాయి అని అనగలరా? మీకు అనుభవం లేదు కాని అనుభవం అయితే అలా అనగలరా? అదే తేడా అనుభవానికి పాండిత్యానికి. గురుమూర్తి చెప్పిన బోధని చక్కగా వ్రాసుకొని మననం చేసుకుంటే మరణాన్ని జయించవచ్చు. మననం ద్వారా మోక్షం సాధించ వచ్చు. నయమే వెంకటేశ్వర్లు గారికి ఇప్పటికైనా అనుగ్రహం కలిగి గుంటూరు సత్సంగ ఉపన్యాసము వ్రాశారు' అన్నారు.



వెంకటేశ్వర్లుగారు ఏదో సమాధానం చెప్పబోగా, 'ప్రాపంచిక సుఖాలమీద ఉన్న వ్యామోహం భగవత్తత్త్వము మీద వుంటుందా? వుంటే ఎంత బాగుంటుందయ్యా? సత్సంగము అవగానే సిగరెట్టు ముట్టించావు కదా! కాని ఉపన్యాసము వ్రాసుకోలేక పోయావు. ఇన్ని రోజులు వుపన్యాసము వ్రాసుకోకుండా వుండగలిగావు గాని సిగరెట్లు కాల్చకుండా వుండగలిగావా?' అని ప్రశ్నించారు.

'మానవులు ఎంత విద్యావంతులైనా, తెలివిగలవారైనా, అగ్రవర్ణములో జన్మించినవారైనా భగవద్భక్తి లేకపోతే ఏం లాభం? బంగారు కొండమీద పుట్టినా దూలగొండిని ఎవరు ప్రేమిస్తారు? పెంటకుప్పమీద పుట్టినా తులసిమొక్కకి విలువనిస్తారు. సత్యమార్గము ఎప్పుడూ ఒక్కటే. అసత్యమార్గాలు అనేకము వుండవచ్చు' అన్నారు శ్రీ బాబు.

ప్లీడరుగారితో మాట్లాడుతూ, 'ఏమండీ మీ స్నేహితుడు మిమ్మల్ని ఏదో ప్రశ్నించాడు. దానికి మీరు ఏదో సమాధానం చెప్పారు కదూ!' అన్నారు శ్రీ బాబు. ప్లీడరుగారు సమాధానం చెపుతూ 'బాబు ఎవరు? ఆయన కులం ఏమిటి? ఆయనకు మీకు ఏమిటి సంబంధం అని అడిగాడు మా స్నేహితుడు' అని చెప్పారు.

శ్రీ బాబు కల్పించుకొని 'మీరు కూడ ఆయనని ప్రశ్నించవలసింది. మీరు తిరుపతి వెళ్తారుకదా! అక్కడ వున్నది శిలావిగ్రహం కదా! మరి ఆ శిలావిగ్రహం మీద ఎందుకు అంత విశ్వాసము. శిలావిగ్రహం మీదనే మీకు అంత విశ్వాసము వుంటే ఇంక సాకార బ్రహ్మంగా ఉన్న గురుదేవునిపై ఎంత విశ్వాసము వుండాలి? అక్కడ వున్న శిలా విగ్రహంలోనూ సాకారబ్రహ్మమైన గురుదేవునిలోనూ మేము దైవత్వాన్ని దర్శిస్తాము' అని చెప్పవలసింది.

'మీకూ నాకూ గల సంబంధం మీకు తెలియదా? మీరు అనుభవించ లేదా! మనమంతా ఏ జాతికి చెందిన వారమో, ఏ కులానికి చెందినవారమో చెప్పవలసింది. మనది అందరిది ఒకటే మతము, విశ్వమతము. ఆ విషయాన్ని తెలియజేయవలసింది. మీ మిత్రునికి మన మధ్య వుండే సంబంధం కూడా మీరు చెప్పవలసింది. గురుదేవుడు అంటే మమ్మల్ని సర్వదా రక్షించేవాడు అని చెప్పకపోయారా ప్లీడరుగారూ!' అన్నారు శ్రీ బాబు. బాబూజీ చేతిలో ఒక దండము వుంది. దానికి ఏడుకట్లు వున్నాయి. శ్రీ బాబుజీ తన చేతిలోని మంత్రదండాన్ని చూపిస్తూ, 'చూశారా దీనిమీద ఏడుకట్లు వున్నాయి. వుష్! అని ఈలవేసి మీ మనస్సుల్ని దీంతో కట్టేస్తాను' అన్నారు శ్రీ బాబు. పురుషోత్తంగారు కల్పించుకొని 'మా మనస్సు కట్టేసి మమ్మల్ని అనుగ్రహించండి' అని అన్నారు.

శ్రీ బాబు కల్పించుకొని, 'మీ మనస్సు నామీద నిల్పితే ఆ పని జరుగుతుంది గాని మీ మనస్సుని దేనిమీదనో లగ్నంచేసి మీ మనస్సు కట్టివేయమంటే ఎలా వీలవుతుందండీ?' అన్నారు.

**శాంత స్వరూపుడును, శేషునిపై శయనించువాడును, నాభియందు పద్మము గలవాడును, దేవతలకధిపతియు, విశ్వ రూపుడు, ఆకాశంతో సమమైన వాడును, మేఘమువంటి నల్లని రంగు కలిగిన వాడును, మేలు చేకూర్చే శరీరము కలవాడును, లక్ష్మీదేవికి పతియును, పద్మదళ నేత్రుడును, యోగుల హృదయములకు కనుపించువాడును, సంసార భయమును పోగొట్టువాడును, సర్వలోకములకు ఏకైక ప్రభువును అయిన శ్రీమహావిష్ణువునకు నమస్కారము.**

- శ్రీ కాళీబాబు

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**ఏప్రియల్ 2026**

**2 గురు – చైత్ర పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**12 ఆది – శ్రీగురుదశమి – ఉ. 11 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**మే 2026**

**1 శుక్ర.–(వైశాఖ) గురు పూర్ణిమ – సా.5.30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

**12 మంగళ – శ్రీగురుదశమి – సా.5.30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

**31 ఆది – అధిక జ్యేష్ఠ పూర్ణిమ – ఉ.11 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**ఏప్రియల్ 2026**

2 గురు– చైత్రపూర్ణిమ – శ్రీ సద్గురుపాదపూజ

12 ఆది – శ్రీగురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

**మే 2026**

**1 శుక్ర– (వైశాఖ) గురుపూర్ణిమ – శ్రీ సద్గురుపాదపూజ.**

**12 మంగళ** – శ్రీ గురుదశమి – శ్రీ సద్గురుపాదపూజ.

31 ఆది – అధిక జ్యేష్ఠ పూర్ణిమ – శ్రీ సద్గురుపాదపూజ

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ఓ నాలుకా! కేశవుణ్ణి కీర్తించు

"భగవన్నామం విన్నటువంటి ప్రతి జీవీ కూడా ఆనందంలో ఓలలాడి తీరాల్సిందే. ప్రతి జీవిలోనూ శృతి, లయలు అంతర్లీనంగా వున్నాయి. మనం మాట్లాడుతున్నా, అడుగు తీసి అడుగు వేయాలన్నా అన్నీ శృతి, లయ బద్ధంగానే జరుగుతున్నాయి. కొంతమంది బాహ్యంగా పాడగలరు. కొంతమంది కూనిరాగాలకే పరిమితమవుతారు. నోరున్నందుకు యితరమైన, వ్యర్థమైన మాటలు మాటలాడకూడదు. నోరారా భగవన్నామాన్ని కీర్తిస్తే, యీ జనన మరణ విషవలయం నుండి మనకి విముక్తి లభిస్తుంది. జరిగిపోయిన కాలాన్ని గురించి బాధపడకండి. ఇక మీదనైనా అప్రమత్తత కలిగి భగవన్నామాన్ని స్మరించండి. అదొక్కటే మనని తరింపజేస్తుంది.




సదాశివ బ్రహ్మేంద్రులవారు '**బ్రూహి ముకుందేతి హే రసనే, పాహి ముకుందేతి**' అని పాడుకుంటూ వెళ్తూ వుండగా ఒక నవాబు ఆయన చేతులు రెంటినీ ఖండించి వేశాడు. భగవన్నామమనే దివ్య మత్తులో మునిగిపోయిన ఆ స్వామికి అలా జరిగినట్టు కూడ తెలియలేదు. ఆయన అలాగే పాడుకుంటూ ముందుకి వెళ్ళిపోతున్నారు. ఇది చూసి అత్యంత ఆశ్చర్య చకితుడైన నవాబు, సదాశివబ్రహ్మేంద్రుల వారి వెమ్మట పరుగులు పెట్టి సమీపించి, "స్వామీ! మీ చేతులు......" అని నీళ్ళు నములుతూ వుంటే, "ఆ! ఏమిటి? ఏం చేతులు?" అన్నాడాయన! ఆ నవాబు యింకా విస్తుపోయి, 'స్వామీ! మీ చేతులని నేను ఖండించి వేశాను" అన్నాడు. అప్పుడు సదాశివబ్రహ్మేంద్రుల వారు "ఓహో! చేతులు ఖండించావా! సరేలే! వాటిని యధాస్థానంలో పెట్టు" అన్నారు. ఆ నవాబు అలాగే చేసేసరికి, ఆ చేతులు యధాస్థితిని, బ్రహ్మేంద్రులవారి దేహంలో అతుక్కుపోయాయి.

ఇది పుక్కిటి పురాణం కాదు. సత్యంగా జరిగిన చరిత్ర. ఈ కలికాలంలో సులభంగా తరించడానికి మార్గం 'భగవన్నామస్మరణ'. '**నామ స్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే**' అని మహాత్ముల వాక్కు. కనుక, భవసాగరాన్ని దాటించే భగవన్నామాన్ని ఎల్లవేళలా స్మరించండి. అఖండైశ్వర్య భోగభాగ్యములను, సుఖశాంతులను, భక్తి, జ్ఞాన, వైరాగ్యములని ప్రసాదించి జగన్మాత సర్వులనూ రక్షించుగాక!

# ఓం పూషదంతభిదే నమః

పాలూరి కాళీప్రసాద్

శ్రీ శివ అష్టోత్తర శతనామావళిలో ఒక నామం **ఓం పూష దంతభిదే నమః.** పూష అనేది సూర్యభగవానుని నామం. లోకానికంతటికీ పోషణనిచ్చేది సూర్యుడే కదా. మరి అటువంటి సూర్యుడికే పోషణకు అవసరమైన దంతాలు లేకుండా పరమేశ్వరుడు ఎందుకు వాటిని భేదనం చేయవలసి వచ్చింది? దక్షయజ్ఞంలో సతీదేవి ఆత్మాహుతి చేసుకొన్నప్పుడు పరమేశ్వరుడు ఉగ్రరూపంలో వీరభద్రుడై ఆ యాగాన్ని ధ్వంసం చేసి దక్షుడి శిరస్సును ఖండించిన చరిత్ర మనందరికీ తెలుసు కదా. ఆ సందర్భంలోనే అక్కడ వున్న దేవతలందరినీ కూడా వీరభద్రుడు శిక్షిస్తాడు. తమ కళ్ళముందు అధర్మం, అన్యాయం జరుగుతూ ఉంటే 'పెద్దవాళ్ళు, వాళ్ళతో మనకెందుకు' అని మోహమాటానికి పోయినందుకు వారు కూడా శిక్ష అనుభవించ వలసి వచ్చింది. ఆ శిక్షలో భాగంగానే సూర్యుడికి పళ్ళు ఊడగొట్టబడ్డాయి. అందుకే రథసప్తమి నాడు, లేదా ఇతర మాఘ అదివారాలలో కూడా సూర్యునికి నైవేద్యం పెట్టడానికి పరమాన్నం వండితే అందులో గట్టి పదార్థాలు (కనీసం జీడిపప్పులు కూడా) లేకుండా వండుతారు.



**కర్తా కారయితా చైవ ప్రేరకశ్చ అనుమోదకః సుకృతం దుష్కృతం చైవ చత్వారః సమభాగినః** అని శాస్త్రం చెబుతోంది. ఒక మంచిపని కానీ చెడ్డపని కానీ జరుగుతున్నప్పుడు ఆ పని చేసినవాడు, చేయించినవాడు, దానికి ప్రేరణ కలిగించిన వాడు, చూసి ఆనందించిన వాడు ఈ నలుగురూ ఆ పనియొక్క ఫలితాన్ని సమానంగా అనుభవిస్తారు. అందుకే ఏదైనా పుణ్యకార్యం జరుగుతున్నప్పుడు మనం ఆ కార్యానికి ఏవిధంగానూ సహకరించలేక పోయినా కనీసం చూసి ఆనందించినా ఆ పుణ్యఫలం మన ఖాతాలో జమ అవుతుంది. అలాగే ఏదైనా పాపకార్యం జరుగుతున్నప్పుడు దానిని ఆపే సామర్థ్యం మనలో లేనప్పుడు ఆ సామర్థ్యం ఉన్నవారిని పిలవాలి, లేదా కనీసం అక్కడి నుంచి దూరంగా అయినా వెళ్ళిపోవాలి. అలా కాకుండా అక్కడే వుండి చూస్తూ వుంటే ఆ శిక్షలో మనం కూడా భాగస్వాములం అవుతాం.

**సారపు ధర్మమున్ విమలసత్యము బాపముచేత బొంకుచే బారము బొందలేక చెడబాటినదైన యవస్థ దక్షు లెవ్వార లుపేక్ష చేసి రది వారలచేటగు గాని ధర్మ నిస్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్**

– అని మహాభారతంలో శ్రీకృష్ణ రాయబార ఘట్టంలో పరమాత్మ భీష్మ ద్రోణాదులను హెచ్చరిస్తాడు. ధర్మానికి, సత్యానికి హాని కలిగినప్పుడు దానిని నివారించగల సమర్థులై ఉండి కూడా ఉపేక్ష చేస్తే, మాట్లాడకుండా ఉండిపోతే, అది వారికే చేటు కలిగిస్తుంది కానీ ఆ సత్య ధర్మాలను కాపాడటానికి పరమాత్మ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు అని చెప్పాడు. మరి కౌరవులు చేసేది అధర్మం అని తెలిసి కూడా

వారి పక్షాన నిలబడినందుకు ఆ పెద్దలందరూ శిక్ష అనుభవించారు కదా! ఇక్కడ వారు కేవలం వారి స్వధర్మాన్ని పట్టుకొని, విశేష ధర్మమైన లోకహితాన్ని వదిలిపెట్టారు కాబట్టి వారు శిక్షను అనుభవించవలసి వచ్చింది. అదే శ్రీకృష్ణుడు ఆ విశేష ధర్మాన్ని నిలబెట్టడానికి 'ఆయుధం చేబట్టన'ని తాను చేసిన వ్యక్తిగత ప్రతిజ్ఞను ప్రక్కనబెట్టి మరీ భీష్ముని మీద చక్ర ప్రయోగం చేయబోయాడు. సత్యం ఎప్పటికీ మారనిది. కానీ ధర్మం మాత్రం దేశకాలాలను బట్టి మారిపోతూ ఉంటుంది. అలాగే ఎవరి ప్రాణాలని, కుటుంబాన్ని కాపాడుకోవడం వారి ధర్మమయినా దేశ హితం కోసం ఒక గ్రామాన్ని, గ్రామహితం కోసం ఒక కుటుంబాన్ని, కుటుంబ హితంకోసం ఒక వ్యక్తిని కూడా వదిలివేయడం  ధర్మసూక్ష్మం. అంతే కానీ మన కళ్ళెదుటే అన్యాయం, అధర్మం జరుగుతూ ఉంటే ఆ చేసేవాడు నా కుటుంబం, నా కులం, నా మతం, నా భాష, లేదా నా రాష్ట్రానికి చెందిన వాడని వాడిని సమర్థించడమో, లేదా కనీసం ఖండించకుండా వుండిపోవడమో చేస్తే దానికి శిక్షను మనం కూడా అనుభవించవలసి వస్తుంది.

ఏ కలి ప్రభావమో కానీ ఈనాడు దేశంలో ఈ సంకుచిత భావనలు పెరిగిపోయి చివరికి మన భావజాలానికి అనుగుణంగా లేని వెనుకటి తరం మహాత్ములను కూడా దూషించే స్థితికి ఈ సమాజం చేరిపోయింది. పులి-మేక కథలో 'నువ్వు కాకపోతే మీ నాన్నో, తాతో నా నీళ్ళు ఎంగిలి చేశారు' అని వంకపెట్టి పులి ఆ మేకపిల్లను తినేసినట్లు ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రితం నీ మతానికి చెందినవాడో, నీ కులానికి చెందినవాడో నా మతానికి, కులానికి చెందిన వారిపై దౌర్జన్యాలు చేశారని వంకపెట్టి ఆ చేసినవారితో ఏ బీరకాయ పీచు సంబంధం లేని వారిని కూడా శిక్షించే, వంచించే స్థితికి చేరుకున్నాం.

అయితే ధర్మానికి ఈ పైకి కనిపించే ఏ భేదాలతోనూ సంబంధం లేదు. మళ్ళీ మనం మహాభారతాన్నే తీసుకుంటే అక్కడ కౌరవ పాండవులు ఇద్దరూ ఒకే దేశానికి, ఒకే మతానికి, ఒకే కులానికి, చివరికి ఒకే కుటుంబానికి చెందినవారే కదా! కానీ ఒకరు ధర్మానికి ప్రతిరూపం అయితే మరొకరు అధర్మానికి ప్రతిరూపమయ్యారు. ఈ సందర్భంలో 'దుర్జనుడి క్రూరత్వం కంటే సజ్జనుడి మౌనం మరింత ప్రమాదకరం' అన్న Martin Luther King Jr. మాటలు మనం గుర్తు చేసుకోవాలి. మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను చూస్తూ కనీసం మాటమాత్రంగానైనా ఖండించలేకపోతే దానికి ఫలితం మనం కూడా అనుభవించవలసి వస్తుంది. అయితే ఇక్కడ ధర్మం అంటే ఏమిటి అన్న ప్రశ్న వస్తుంది. హిందీలో అయితే మతం అన్న అర్థంలో కూడా ధర్మం అనే పదాన్ని వాడుతారు. అయితే నిజమైన ధర్మం ఏమిటి అన్న దానికి ఆ మహాభారతమే సమాధానం చెబుతోంది. **ఒరులేయవి యొనరించిన నరవర! యప్రియము దన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్.** (తరువాయి భాగం 30వ, పేజీలో చూడండి.............)

# సహవాస దోషం

-బి. లక్ష్మీ లలితా కుమారి

ఈ కలియుగంలో మనకు దోషాలు తగలొద్దు అంటే మన సహవాసం కూడా ముఖ్యమే. ఒకసారి అవి కూడా చూసుకోవాలి. ఒక గురువు తన శిష్యుడితో కలిసి తీర ప్రాంతాన నడుస్తూ వస్తున్నాడు. వారికి సుదూరంగా ఒక ఓడ కనిపించింది. ఇద్దరూ చల్లగాలిని ఆస్వాదిస్తున్నారు. కొన్ని నిమిషాలు గడిచిందో లేదో హఠాత్తుగా వాతావరణంలో మార్పు వచ్చింది. సముద్రంలో అలలు ఉవ్వెత్తున్న లేచాయి. గురుశిష్యులిద్దరూ ఆశ్చర్యంగా చూస్తుండగానే ఓడ మునిగిపోయింది. అందులో ఎందరు ప్రయాణిస్తున్నారో, ఎందరి ప్రాణాలు పోయాయో తెలియదు!!

అంతలోనే వాతావరణం సామాన్య స్థితికి వచ్చేసింది. శిష్యుడికి దుఃఖం ఆగలేదు. 'గురువర్యా! ఏమిటీ విపత్తు? పాపం కదా! ఒక్కసారి ఇంతమంది చనిపోయారంటే?' అన్నాడు. 'ఏం చెప్పను? చేసిన పాపాల ఫలితం!' అన్నాడాయన.

'అందరూ పాపులేనా? కొందరైనా పుణ్యాత్ములు వుంటారుగా! భగవంతుడు వారిని కూడా ఎందుకు చంపాడు?' అని అడిగాడు శిష్యుడు. దానికి ఆ గురువుగారు సమాధానం చెప్పలేదు.

ఇద్దరూ తిరిగి తమ ఆశ్రమానికి వెళ్ళారు. శిష్యుడు తన సందేహం గురించి మరచిపోయాడు. మర్నాడు యధాప్రకారం గురుశిష్యులిద్దరూ సముద్రతీరాన నడుస్తున్నారు. శిష్యుడికి అందమైన శంఖం కనిపించడంతో ఆనందంగా చేతిలోకి తీసుకున్నాడు. అందులోకి కొన్ని చీమలు చేరాయి. వాటిలోని ఒక చీమ శిష్యుడి చేతిమీద కుట్టింది. చురుక్కుమనడంతో శంఖాన్ని గబుక్కున సముద్రంలోకి విసిరేశాడు. ఎన్ని చీమలు కుట్టాయని గురువుగారు అడిగారు. 'ఒక్కటే' అన్నాడు. 'మరి ఒక్క చీమకు వేయవలసిన శిక్షను అన్ని చీమలకు వేయడం సరియైనదేనా?' అన్నారు గురువుగారు.

'అర్థమైంది గురుదేవా! మనం మంచిగా వున్నంత మాత్రాన చాలదు. మన చుట్టూ వున్నవారు కూడా మంచివారై వుండాలి' అన్నాడు ఆ శిష్యుడు నమస్కరిస్తూ.

ఇది చదివాక మనకు సత్సంగం, సత్సాంగత్యం ఎందుకు అవసరమో అర్థం అవ్వాలి!!

(గత సంచిక తరువాయి) **నాదోపాసన**

-భాగవతుల హనుమత్ జయప్రద

శిష్యుడు తీసుకుని పల్లకిలో త్యాగరాజ స్వామి బొంత కింద పెట్టాడు. పల్లకిని శిష్యులు మోసుకుని వెళుతున్నారు. కొంత దూరం వెళ్ళాక, అక్కడ బాటసారులు పరిగెడుతున్నారు. ఎందుకు అలా పరిగెడుతున్నారు అంటే, 'దారిదొంగలు వస్తున్నారు భయపడి పారిపోతున్నాము మీరూ పల్లకీని తిప్ప' మని చెప్పారు. దొంగలు వస్తే మాత్రము మన దగ్గర ఏమున్నది? పల్లకి ముందుకి పోనివ్వమన్నారు త్యాగరాజస్వామి.

శిష్యులు మీ బొంత కింద డబ్బు ఉన్నది అంటే, ఎందుకు పుచ్చుకున్నావని అడిగారు. 'మీకు అని పుచ్చుకోలేదు. రాముడికి అని చెపితే పుచ్చుకున్నాము' అని జవాబు చెప్పారు. 'ఆ డబ్బు రాముడిదా' అంటే అవునని చెప్పారు. 'అయితే మీకు, నాకు దిగులు ఎందుకు? ఆయన ఇచ్చుకుంటే ఇచ్చుకుంటాడు, రక్షించుకుంటే రక్షించుకుంటాడు. పోనివ్వ'మని అన్నారు. పల్లకి ముందుకు వెడుతుండగా దొంగలు త్యాగరాజస్వామి పల్లకి వద్దకి రాబోయి, వెనకకు వెళ్ళిపోయారు. ఏమైనదో ఎవరికి తెలియదు. కొంత దూరము వెళ్ళిన తరవాత ఆ రాత్రి ఒక చెట్టుకింద ఆగి, విశ్రాంతి తీసుకుని, మరునాడు అనుష్ఠానము చేసుకుని, బయలుదేరాలి అనుకుంటుండగా దొంగలు పరిగెత్తుకుని వచ్చి, త్యాగరాజ స్వామి కాళ్ళమీద పడ్డారు.

ఏమైనది అని అడిగితే 'అయ్యా! నిన్న మీ దగ్గరకు దొంగతనము చెయ్యడానికి వచ్చాము. అప్పుడు మీ పల్లకి వద్ద ఇద్దరు కనపడ్డారు. ఒకడు నీలమేఘచ్ఛాయతో వుండి చేతిలో ధనస్సు పట్టుకున్నాడు. మావంక చూస్తూ బాణము ఆకర్ణాంతము లాగి పట్టుకున్నాడు. పక్కన ఎర్రని ఇంకొకాయన అలాగే బాణము పట్టుకుని చూస్తున్నాడు. చంపుతారేమో అని పారిపోయాము. కానీ వారు రాత్రి అంతా మా కళ్ళల్లో మెదులుతూనే వున్నారు. ఏమి అందగాళ్ళు. ఇంకోసారి చూడాలని ఉన్నది. చంపితే చంపారు కానీ, వాళ్ళని చూపించ'మని అడిగారు. రామచంద్రమూర్తి అంటే '**పుంసామ్ మోహన రూపాయ పుణ్య శ్లోకాయ మంగళమ్**' కదా. త్యాగరాజస్వామి తెల్లబోయి, రాముడి సొమ్ము అన్నందుకు దొంగలు పట్టుకునిపోతారేమో అని రామ లక్ష్మణులే వచ్చి పల్లకీ వద్ద కాపలా కాసి కాపాడుకున్నారు అని భక్తితో రామలక్ష్మణులకు నమస్కరించారు. అలా రామలక్ష్మణులు త్యాగరాజ స్వామిని ఎల్లప్పుడూ కాపాడారు.

నాదోపాసన చేసి తాను బ్రహ్మములో ఐక్యం కావడమే కాక సకలదేవతలపై మంత్రసదృశములైన కీర్తనలు రచించి ఎందరికో భక్తి భావనను నేటికీ కలుగజేస్తున్న మహర్షి త్యాగయ్య. సంగీతాన్ని పాడడం నాదోపాసన కాదు. ప్రతి స్వరాన్ని దేవతగా

ఉపాసించడం ఒక ప్రక్రియ. అందులో పూర్ణ సిద్ధిని పొందిన మహాత్ముడితడు. నాదమూర్తి అయిన నారదుడి దర్శనాన్ని పొందినవారు. '**శ్రీనారదముని గురురాయని గంటి ఏనాటి తపమో గురురాయ మనసార గోరితి గురురాయ నేడు కనులార కనుగొంటి**' అని తన అనుభవాన్ని కృతిగా సంతరించారు.

సర్వ దేవతలనూ రామమయంగా భావించగలిగే, భేదరహిత భక్తి త్యాగయ్య ప్రత్యేకత. '**శివ శివ శివయనరాదా**', '**దేవాదిదేవ సదాశివా**', '**నీవంటి దైవమును షడానన నేనెందు కాననురా**', '**శ్రీ గణపతిని సేవింపరారే**' ఇలా చాలా కీర్తనలు సర్వ దేవమయంగా సాగాయి. **శాంతము లేక సౌఖ్యము లేదు**', '**మనసు నిల్ప శక్తి లేకపోతే మధుర ఘంట విరుల పూజేమి చేయు**', '**నను పాలింప నడచి వచ్చితివా**', '**దొరకునా ఇటువంటి సేవ**' ఇలా ఎన్నో కృతుల వాక్యాలు తెలుగువారి నిత్య జీవనంలోని పలుకుబడులుగా మిగిలిపోయాయి. త్యాగరాజు సంస్కృతంలోనూ కీర్తనలు వ్రాశారు. ఘనరాగ పంచరత్న కీర్తనల్లో మొదటిదైన 'జగదానంద కారక జయ జానకీ ప్రాణదాయక'– సంస్కృత భాషలో వ్రాశారు. పంచరత్న కీర్తనలన్నీ భావయుక్త సంగీత గుళికలు. తాను పూజించే శ్రీరాముడు ఎటువంటివాడు?... **ఇంద్రనీలమణి సన్నిభా ఘనచంద్ర సూర్యనయనా ప్రమేయ వాగీంద్ర జనక సకలేశ శుభ్ర నాగేంద్ర శయన శమనవైరి సన్నుతుడు!** హృదయంఎవరికైనా పులకరిస్తుంది ఇలాంటి భావన కలిగినప్పుడు!

సంగీతంలో భావమే ప్రధానమైందని త్యాగయ్య తన శిష్యులతో అనే వారట. భావం తరవాతి స్థానాలనే రాగం, తాళం ఆక్రమిస్తాయి. వాల్మీకి వ్రాసిన రామాయణంలో 24వేల శ్లోకాలున్నాయి. త్యాగరాజు కూడా 24 వేల కీర్తనలు రచించారని ప్రతీతి. అయితే ఆయన రచించిన 24 వేల కీర్తనల్లో ప్రస్తుతం 700 కీర్తనలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

నలభై సంవత్సరాల వయసు నాటికి త్యాగయ్య దక్షిణ భారతదేశం మొత్తంలో సామవేద సాధకుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. త్యాగయ్య గానామృతాన్ని వినడానికి తహతహలాడిన ఎందరో సంగీతజ్ఞులు శొంఠి వెంకట రమణయ్యను ఆశ్రయించి త్యాగయ్య సంగీత కచేరీ ఏర్పాటు చేయమని కోరారు. గురువు మాట మన్నించి త్యాగయ్య తన సంగీత సభలో సభాసదులందరికీ నమస్కరించి శ్రీరాగంలో '**ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు**' అని గానం చేశారు.

- సశేషం

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

ఇప్పుడు నీకు ఇక్కడ ఒక సందేహం కలగటం సహజం. "ఈ దేహము, ఈ బాల్యము, ఈ కౌమారము, ఈ యవ్వనము, ఇవన్నీ మార్పుకు లోనయ్యేవీ, అసత్యములూ అయితే కావచ్చు కాని, మరి ఇవి దేహంలో ఇన్ని మార్పులను కలిగిస్తున్నాయి కదా? వాటినన్నిటిని నీవు అనుభవిస్తున్నావు కదా? పైగా ఇవన్నీ ఎంతో వాస్తవంగా కనిపిస్తున్నాయి గదా? మరి ఇదంతా కూడా అసత్యమేనా? భ్రాంతియేనా? అసలు అలాంటి భ్రాంతి సాధ్యమా?" అని. ఎందుకు సాధ్యంకాదు? నీవు వీటిని కూడా జాగ్రత్తగా గమనించు.



ఇవి కూడా మార్పుకు లోను అవుతున్నవే. నీవు విషయాలను, అవి కల్పిస్తున్న సంచలనాలను విడివిడిగా గమనించటం నేర్చుకోవాలి. విషయాలు మారిపోతున్నాయి. అవి సృష్టించే సంచలనాలు కూడా శాశ్వతంగా ఉండిపోవటం లేదు. అవి కల్పిస్తున్న సుఖాలు కాని దుఃఖాలు కాని ఏవీ శాశ్వతంగా ఉండిపోవటం లేదు. విషయాలు ఏవిధంగా క్షణభంగురములో ఇవి కూడా అలాగే బుద్బుదప్రాయములు. సమంగా చూస్తే ఇవన్నీ ఒకే మూలతత్త్వమైన సచ్చిదానందం యొక్క నామ రూపాదులు మాత్రమే అని నీవే గ్రహించగలుగుతావు. సినిమాలో, కదలని, కదలలేని బొమ్మలు ఉన్న ఒక ఫిల్మ్‌రీలు వేగంగా తిరుగుతూ ఉంటే, కదలకుండా ఉన్న తెరపైన బొమ్మలు కదులుతున్నట్లు కనిపిస్తాయి. ఈ కదలని తెర అనేది ఒకటి ఉండటంవల్లనే, నీకు బొమ్మలు కనిపించటమే కాక, అవి కదులుతున్నట్లు కనిపించటం, వాటి కదలికలకు మధ్య సమన్వయం అనేది కుదరటం జరుగుతున్నాయి. కాని ఆ తెర మాత్రం, ఆ బొమ్మలు కాని, ఆ బొమ్మల రంగులు కాని, అవి కలిగించే అనుభూతులు కాని, ఏవీ తనకు అంటుకోకుండా, కేవలం సాక్షిలాగా, నిశ్చలంగా నిలచి ఉంటుంది. ఫిల్ము ఆపివేస్తే బొమ్మలు కాని, వాటి అనుభూతులు కాని, ఏవీ తనకు అంటుకోకుండా, ముందున్నట్లుగా తెర స్వచ్ఛంగా మిగిలిపోయి కనిపిస్తుంది. అదే విధంగా నీలో కూడా

కదలకుండా ఉండే అటువంటి స్వచ్ఛమైన తెర ఒకటి ఉన్నది. ఈ తెర ఉండటం వల్లనే నీలో వివిధములైన వేరువేరు సంఘటనలకు మధ్య సంధానం కుదురుతున్నది. అలాగే నీవు "నేను యవ్వనవంతుడను, లేదా పండితుడను" అని భావించుకొనటం జరుగుతోంది. కాని తెర మాత్రం ఇవేవీ తనకు అంటక, నిర్మలంగా, స్వచ్ఛంగా, సాక్షిగా ఉన్నది.

**14. మాత్రా స్పర్శాస్తు కౌంతేయ! శీతోష్ణ సుఖ దుఃఖ దాః**
**ఆగమా పాయినో-నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత! ॥**

**15. యం హి న వ్యథయం త్యేతే పురుషం పురుషర్షభ!**
**సమదుఃఖ సుఖం ధీరం సో-మృతత్వాయ కల్పతే ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! సుఖదుఃఖాలు అంటే ఏమిటి? ప్రాపంచిక విషయములైన ఇంద్రియార్థాలకు ఆయా ఇంద్రియాలతో సంయోగం కలిగినప్పుడు మనస్సుకు శీతోష్ణాదులవంటి స్పర్శజ్ఞానము, వాటి వలన సుఖ, దుఃఖాదులు కలుగుతాయి. ఇవన్నీ క్షణికమైనవి. అనిత్యమైనవి. వాటికి లొంగకుండ మనస్సును ఉంచగలిగితే వాటిని సహించటం, ఓర్చుకొనటం చేతనౌతుంది. ఆ విధంగా ఇంద్రియాలకు లొంగకుండా నీ మనస్సును నియమించుకొని నీవు బాహ్య స్పర్శలకు అతీతుడవు కావాలి. ఋతుక్రమాన్ని అనుసరించి వేసవిలో వేడిమి, హేమంతంలో చలి ఎక్కువగా ఎలా ఉంటాయో, అదే విధంగా ప్రారబ్ధాన్ని అనుసరించి సుఖదుఃఖాదులు సంభవించటం కూడా అనివార్యం. వీటి నుండి తప్పించుకొనటం ఎవ్వరికీ సాధ్యంకాదు. కాని మనస్సును ఇంద్రియాలకు లోబడనీయక ఎవడు శీతోష్ణాదులను ఓరిమితో సహించగలుగుతాడో వాడు వివేకవంతుడు. ఎవరు శీతోష్ణాది బాధలకు సుఖదుఃఖాలకు అతీతుడై, అన్నింటియందు సమత్వమును కలిగి వుంటాడో, అట్టి ధీరుడు మాత్రమే అమృతత్వాన్ని లేక అమరత్వాన్ని పొందటానికి అర్హుడు. అంటే పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, మనస్సు మీద వాటి ప్రభావం లేకుండా స్థిరంగా ఉండగలగాలి. పరబ్రహ్మస్థితికి అధికారివి కావాలి అంటే అదొక్కటే మార్గం" అన్నాడు.

- సశేషం

# స్వామి దయానంద మహరాజ్

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళి

స్వామీజీ తిరిగి సంత్ మండలికి వెళ్తున్న సమయంలో తన అన్నలకు ఇతర కుటుంబ సభ్యులకు "ప్రపంచంలో జీవిస్తూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించండి," అని ఉపదేశం చేశారు. స్వామీజీ సంత్ మండలిలో చేరేందుకు వెళ్తున్నప్పుడు తండ్రి శ్రీ ఘసీటా రామ్ ఆయనతో పాటు వెళ్ళారు. మహామండలేశ్వర్ గారికి మిఠాయిలు, పండ్లు మరియు వస్త్రాలు తీసుకెళ్ళారు. కన్నీళ్ళు తిరుగుతున్న తన కళ్ళతో, తండ్రి స్వామీజీని ఆయన గురుదేవుని చేతుల్లో అప్పగిస్తూ "స్వామీజీ ఇల్లు విడిచి వెళ్ళిన తరువాత, మా కుటుంబం మొత్తం ఆందోళనతో, భయంతో మునిగి పోయింది. అతన్ని వేదాధ్యయన కేంద్రాలు, యాత్రా స్థలాలు, మఠాల వద్ద వెతుకుతూ తిరిగాం. ఇది స్వామీజీ చేసిన పాపం కాదా? ఒక కుటుంబాన్ని ఇలా బాధలో ముంచడం తప్ప కాదా?" అన్నారు. అప్పడు మహామండలేశ్వర్ గారి మౌనానికి స్పందనగా దయానంద స్వామీజీ "మా కుటుంబం ఆర్య సమాజం భావాలను నమ్ముతుంది. ఈ నేపథ్యంలో వారు పుణ్యక్షేత్రాలకు ప్రయాణించటం, అయినా ఇది నన్ను వెతికే ప్రయత్నంగా జరిగినా సరే, వారి భౌతిక జీవితం పవిత్రం అయ్యేందుకు దేవుడిచ్చిన అనుగ్రహంగా భావించాలి" అని సమాధానం యిచ్చారు.

సహివాల్‌లో జరిగిన సత్సంగ్ సమయంలో రావల్పిండి నుంచి కొందరు భక్తులు వచ్చి మహామండలేశ్వర్ స్వామి విష్ణుదేవానంద గిరి స్వామి మరియు ఇతర సాధువులను రావల్పిండి వచ్చి కొంతకాలం సత్సంగ్ నిర్వహించాక అమర్‌నాథ్ గుహను సందర్శించమని కోరారు. రావల్పిండి భక్తులు ఎంతో విశేషంగా వసతి మరియు సత్సంగ్ ఏర్పాట్లు చేశారు. కొన్ని రోజుల తరువాత, సంత్ మండలి రాజా కరణ్ సింగ్ గారి తండ్రి ఆతిథ్యాన్ని స్వీకరించి కాశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్రకు వెళ్ళారు. వారు పహల్గామ్‌లో సుమారు రెండు నెలల పాటు గడిపి, అమర్‌నాథ్ గుహ పవిత్ర దర్శనం పొంది అనంతరం వారు జమ్మూ ద్వారా తిరిగి రిషికేశ్ ఆశ్రమానికి తిరిగొచ్చారు. స్వామీజీ, ఈ యాత్ర గురించి భక్తులతో చర్చల సందర్భంగా తరచూ కాశ్మీర్ లోయ అందాలు, అమర్‌నాథ్ గుహ, క్షీర భవానీ మాతా ఆలయం దర్శనం, ఝీలం నది అందాలు గురించి గొప్పగా వర్ణించేవారు.

రిషికేశ్ ఆశ్రమానికి తిరిగి వచ్చిన తరువాత స్వామీజీ మళ్ళీ తన ఆధ్యాత్మిక గ్రంథాల అధ్యయనం, యోగ సాధన, ధ్యానం మొదలు పెట్టారు. అదే సంవత్సరం ప్రయాగ (అలహాబాద్)లో జరిగిన కుంభ మేళా మహోత్సవంలో పాల్గొనడానికి సంత్ మండలి వెళ్ళింది. మహామండలేశ్వర్ గారు స్వామీజీకి ఆధ్యాత్మికంగా మరింత లోతైన జ్ఞానం సాధించాలనే కోరికను గమనించి కాశీ (వారణాసి)కి వెళ్ళి, ప్రసిద్ధ సన్యాసి శంకరచేతన్ భారతీజీ వద్ద వేదాంతం మరియు వున్నత స్థాయి ఆధ్యాత్మికతను అభ్యసించమని ఆదేశించారు. స్వామీజీ 5-6 సంవత్సరాలు కాశీలో గడిపి, “చిత్సుఖి”, “ఖండన ఖండ ఖాద్య”, “శంకర భాష్య”, “న్యాయ”, “సాంఖ్య”, “పూర్వ మీమాంస”, “ఉత్తర మీమాంస” వంటి గ్రంథాలను లోతుగా అధ్యయనం చేశారు. ఇంకా పండిట్ రామ్ చందర్ దీక్షిత్ గారి మార్గదర్శకత్వంలో అద్వైత సిద్ధి గ్రంథాన్ని కూడా నేర్చుకున్నారు. శాంతమైన వాతావరణంలో గంభీర అధ్యయనం, ధ్యానం ద్వారా, స్వామీజీకి సనాతన హిందూ తత్వశాస్త్రం యొక్క అన్ని అంశాల్లోనూ విశేషమైన జ్ఞానం లభించింది. కాశీ నుండి రిషికేశ్‌లోని కైలాశ్ ఆశ్రమానికి వేలాది మందికి ఆధ్యాత్మిక మార్గ దర్శకత్వం ఇవ్వగలిగే ఓ జ్ఞాన స్వరూపిగా తిరిగి వచ్చారు.

కాశీ నుండి స్వామీజీ వైదిక విద్యనభ్యసించి తిరిగి వచ్చిన సమయం ఆయన జీవితంలోని మరపురాని ఘట్టం. స్వామీజీ చదువులో చూపిన పట్టుదల, భక్తిని చూసిన శంకరచేతన్ భారతీజీ మరియు ఆశ్రమంలోని ఇతర సభ్యులు స్వయంగా గేట్ వరకు వచ్చి స్వామీజీకి వీడ్కోలు చెప్పారు. వీడ్కోలు సందర్భంగా స్వామీజీ “ఇక మీదట నేను వేదాంత బోధనలకు అనుగుణంగా, ప్రపంచ భోగాలపై విరక్తితో, నడిచే ప్రయాణం చేస్తాను. రోజుకు ఒక్కసారి మాత్రమే భిక్ష తీసుకుంటాను. డబ్బును ఎప్పటికీ స్పర్శించను.” అన్నారు. దానికి స్పందనగా శంకరచేతన్ భారతీ గారు ఇలా అన్నారు: “నేను కూడా ఇదే మార్గాన్ని అనుసరించాలనుకున్నాను. కానీ కొన్ని కారణాల వల్ల చేయలేకపోయాను. మీరు ఆ మార్గాన్ని స్వీకరించడం నిజంగా అభినందనీయం.”

- సశేషం

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**121. ఓం ఉత్తమాయ నమః**

ఏ కొలమానం ప్రకారం చూసినా ఈ ప్రపంచలో అందరికంటే అన్నిటికంటే గొప్పదైన ఏ పరమాత్మ తత్వం ఉన్నదో అదే శ్రీగురుదేవులు.

**122. ఓం సర్వ పాపఘ్నాయ నమః**

ఎవరైతే శ్రీగురుదేవుల యందు పూర్ణ విశ్వాసముంచి వారు చెప్పినది తు.చ. తప్పక ఆచరిస్తారో వారియొక్క సర్వ పాపములను హరించి వారిని పుణ్య స్వరూపులుగా తీర్చిదిద్దగల సమర్థులు శ్రీగురుదేవులు.

**123. ఓం చిత్త శాంతి ప్రదాయకాయ నమః**

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన వారి చిత్తములోని అలజడులను, సంకల్పాలను, వాసనలను హరించివేసి వారికి పరమ శాంతిని ప్రసాదించగల సమర్థులు. శ్రీగురుదేవుల పాద తీర్థాన్ని సేవించినంతనే చిత్తమునకు పరమ శాంతి కలుగుతుంది.

**124. ఓం సమస్త సుఖ సంధాత్రే నమః**

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన వారికి సమస్త సుఖములను ప్రసాదించే కల్పతరువు వంటివారు. వారిని ఆశ్రయించిన వారికి ఏ లోటూ రాదు. ఇహ లోక సుఖములనే కాక శాశ్వతమైన ఆత్మానందాన్ని వారికి ప్రసాదిస్తారు.

**125. ఓం సర్వానర్థ నివారకాయ నమః**

శ్రీ గురుదేవులు వారి శిష్యులకు కలిగే సమస్త ఆపదలను, బాధలను, వారి సాధన మార్గంలో కలిగే ఆటంకములను తొలగించి వారికి పరమ పదాన్ని ప్రసాదించగల సమర్థులు.

**126. ఓం మహా ధన్యాయ నమః**

శ్రీ గురుదేవుల యొక్క ఆత్మజ్ఞాన సంపద మాటలలో చెప్పలేనిది. ఈ జగత్తులో ఉన్న సమస్త ధనము రాశి పోసినా వారి సంపదలో అవగింజంతైనా ఉండదు. తృప్తిని

మించిన ధనము లేదు. జ్ఞాన వైరాగ్యముల చేత నిత్య తృప్తులైన వారి సంపదను, ఐశ్వర్యాన్ని ఎవరు కొలవగలరు?

**127. ఓం జగన్మాన్యాయ నమః**

శ్రీగురుదేవులు ఈ జగత్తు అంతటిచే గౌరవింపబడేవారు, పూజింపబడేవారు. ఈ జగత్తులో అన్నిటికన్నా గొప్ప వస్తువు ఏదైతే ఉందో దానికన్నా గొప్పది గురు తత్త్వం. అందువలన శ్రీగురుదేవులు జగత్తు అంతటికీ పూజ్యులు, వందనీయులు. జనించి, గతించే జగత్తులో శాశ్వతులు శ్రీ, గురుదేవులు ఒక్కరే.

**128. ఓం మనోజ సమ సుందరాయ నమః**

శ్రీగురుదేవులు నిర్మల ఆత్మసౌందర్య స్వరూపులు. మన్మధుని మించిన సౌందర్యం వారిది. మన మనస్సులోని మాలిన్యాన్ని క్షాళన చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నవారు. అందువలన శ్రీగురుదేవులు బుద్ధి ద్వారా మాత్రమే గ్రహింప సాధ్యులు. మధురమైన స్వరం, కోమలమైన స్పర్శ, సుందర రూపం, కమ్మని రుచి, దివ్య సుగంధం – ఈ ఐదు మన జ్ఞానేంద్రియాల వలన గ్రహింపబడి మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయి. ఈ జ్ఞానేంద్రియాల వలన కలిగే ఆనందం క్షణికమైనది. కానీ శ్రీగురుదేవుల నుండి లభించే ఆనందం శాశ్వతమైనది.

**129. ఓం మహానంద ప్రదాయ నమః**

శ్రీ గురుదేవులు ఈ సృష్టిలోని సమస్త ప్రాణులకు అమితమైన, శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదిస్తారు. ఈ సృష్టిలో మనం అనుభవించే భౌతికమైన ఆనందాలన్నీ అశాశ్వతమైనవి, దుఃఖంతో కూడుకొని ఉన్నవి. కానీ శ్రీగురుదేవులు ప్రసాదించే ఆనందం శాశ్వతమైనది.

**130. ఓం విద్వన్మాననీయ గుణాకరాయ నమః**

ఏ ఏ గుణాలైతే మంచి గుణాలని విద్వాంసుల చేత గౌరవింపబడుతున్నాయో అట్టి గుణములన్నిటియొక్క రాశీభూతమైన సద్గుణ సంపన్నులు శ్రీగురుదేవులు. ఈ లోకంలో సద్గుణ సంపన్నులై సదాచార పరాయణులై మెలగవలెనని ప్రయత్నించు వారందరికి ఆదర్శం శ్రీగురుదేవులే.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

"తండ్రీ...! మధురలో ఆ కారాగారవాస సమయంలో ప్రతీక్షిస్తూ వుండేవాళ్ళము. కారాగారవాసం ముగుస్తుంది అనే విశ్వాసం ఉండినది కదా! 'కృష్ణుడు తప్పక వస్తాడు. దేవకి అష్టమ గర్భాన పుట్టినవాడు మధురకు కంసుని పాలన నుండి విముక్తి కలిగిస్తాడు' అని నారదుడు ధైర్య వచనాలు చెప్పాడు కదా! అర్జునా!.... కాని...కాని ఇప్పుడు అలా ఊరట కలిగించే నారదుని వాక్కు ఏదీ! కృష్ణ విహీనమైన ఆ కారాగారంలో కృష్ణుడి కోసం ప్రతీక్షించటంలోనే కాలం అంతా గడిచిపోయింది. కాని అప్పుడు అదే మా జీవితాలకు ఆశాజ్యోతి, జీవిత సర్వస్వం, పరమావధి. కాని ఇప్పుడేమున్నది? ఆ ప్రతీక్ష కూడా లేదు. అర్జునా! ఇప్పుడనుభవిస్తున్న ఈ కారాగార శిక్ష కంసుని కారాగార వాసం కంటే ఎంతో దుస్సహంగానూ, దుర్భరంగానూ, వేదనాభరితంగానూ ఉన్నదయ్యా!" వసుదేవుడి కంఠం గద్గదమైంది.



"ఆపండి తండ్రీ! ఆపండి! మీరు చెప్పేది వినలేకపోతున్నాను.... నా హృదయం బ్రద్దలౌతున్నది" అర్జునుడు అరిచినంత పని చేశాడు.

"పార్థా!" వసుదేవుడు నెమ్మదిగా అన్నాడు, "ఇక కృష్ణుడి కోసం ప్రతీక్ష అనేదే లేకపోతే, ఈ కారాగార వాసం నుండి విముక్తి పొందటానికి మిగిలింది ఒకే ఒక మార్గం..." వసుదేవుడు కొంచెం ఆగాడు. మళ్ళీ తనను తాను సంబాళించుకొని "అర్జునా! ఆ రోజున నేను కృష్ణుని తండ్రిగా కృష్ణుణ్ణి కారాగారం బయటకు తీసికొని వచ్చాను. కాని సత్యం ఏమిటంటే ఆ చిన్నారి కృష్ణుణ్ణి కన్న తల్లిదండ్రుల నుంచి దూరం చేశాను. అందుకే కాబోలు ఆ చిన్నారి కృష్ణుడు మమ్మల్ని పుత్ర ప్రేమ నుండి వంచితులను చేసి, 'తండ్రీ! ఆనాడు నేను అనుభవించిన వ్యథలో కొద్ది... అతి కొద్ది వ్యథను ఇప్పుడు మీరుకూడా అనుభవించండి' అని చెవిలో చెబుతన్నట్లున్నది. ఆ కొంచెం వ్యథ కూడా, అర్జునా! ఎంత దుర్భరంగా ఉన్నది! నాయనా! అర్జునా..." వసుదేవుడు ఉద్వేగాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టాడు.

అర్జునుడికి ఇక అక్కడ నుంచోవడం కూడా ఎంతో కష్టంగా అనిపిస్తున్నది. అక్కడ నుండి తప్పించుకొనే ప్రయత్నంలో అర్జునుడు “తండ్రీ! ఇక మీ అనుజ్ఞ అయితే... రుక్మిణి, సత్యభామ, దేవేరుల నివాసాలకు వెళ్ళవలసి ఉంది. ఇప్పటికే రాత్రి మొదటి జాము అయిపోతున్నది” అన్నాడు.

వసుదేవుడు తనను తాను నిగ్రహించుకొని “అలాగే నాయనా! వెళ్ళు. వెళ్ళి రుక్మిణి, సత్యభామలను ఊరడించు. ఆ తరువాత... ఔను! ఆ తరువాత ప్రాతఃకాలం సూర్యుడు ఉదయించగానే ఇక్కడికి రా నాయనా!” అన్నాడు.

“ప్రాతఃకాలంలోనా! అంత ఉదయాన్నే రమ్మంటున్నారెందుకు?” అడిగాడు అర్జునుడు.

“కారణమా?” వసుదేవుడు ఒక శుష్కహాసం చేశాడు. “ఏ దుర్భర కారాగార వాసంనుండి ముక్తి పొందటానికి ఇక ప్రతీక్షించనక్కరలేదో, ఆ కారాగారవాసం నుండి ముక్తి పొందే క్షణం దగ్గర పడింది.”

“అంటే?” అడిగాడు అర్జునుడు.

“రేపు బ్రహ్మ ముహూర్తంలో నేను యోగ సమాధిలోకి వెళ్ళి దేహత్యాగం చేస్తాను. ఈ దేహం లోపల పంచభూతాలు చాలాకాలంగా ఉన్నాయి. ఇక పంచ భూతాలకు సద్గతి ప్రాప్తించుగాక!”

“తండ్రీ! అర్జునుడు అంతకన్నా ఏమీ అనలేకపోయాడు. “నా పార్థివ శరీరానికి అంత్యేష్టి చేసిన తరువాతే నీవు ప్రభాస క్షేత్రానికి వెళ్ళు నాయనా! హిరణ్ – కపిలా సంగమం తీరంలో కృష్ణుడు కనక కనిపిస్తే నీ తండ్రి వసుదేవుడు.....” “తల్లి దేవకి కూడా...” దేవకి మధ్యలోనే అందుకుంటూ అన్నది.

“స్వర్గంలోని కారాగారవాసంలో కూడా నీ కొరకు ప్రతీక్షిస్తూ ఉంటాము అని చెప్పు నాయనా! ఏ స్థానంలో కృష్ణుణ్ణి విడిచి ఉండవలసి వస్తుందో ఆ స్థానం అది స్వర్గమే కావచ్చు కాక, అయినా అతని తల్లిదండ్రులమైన మాకు మాత్రం అది కారాగృహమే. అక్కడ మేము కృష్ణుని కొరకు యుగాంతాల వరకు ప్రతీక్షిస్తుంటాము.”

ఎంతో కష్టం మీద ఆపుకున్న కన్నీరు దేవకి చెక్కిళ్ళ మీదుగా ధారలుగా కారిపోతున్నాయి. అర్జునుడు తాను నిబ్బరంగా ఉండాలని ఎంత ప్రయత్నించినా అతనికి సాధ్యం కాలేదు. చివరకు అతను కూడా దుఃఖాన్ని దిగమింగలేక పైకి ఏడ్చాడు.


- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 58: అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌని**

**తాత్పర్యము:** ఇతర ఆధ్యాత్మిక మార్గాలతో పోలిస్తే భక్తి మార్గం సులభము. ఇతర ఆధ్యాత్మిక మార్గాలతో పోలిస్తే భక్తి మార్గం అత్యంత సులభమైనదని నారదులు ఈ సూత్రము ద్వారా తెలియజేస్తున్నారు. ఉదాహరణకు ముఖ్యమైన ఆధ్యాత్మిక మార్గాలైన జ్ఞానయోగం, కర్మయోగం, రాజయోగం మొదలైన వాటిని పరిశీలిద్దాం. జ్ఞానయోగానికి లోతైన వేదాంత అవగాహన, కర్మయోగానికి ఫలాపేక్ష లేకుండా నిరంతర కర్తవ్య ఆచరణ, రాజయోగానికి కఠినమైన ధ్యాన సాధన మరియు ఇంద్రియనిగ్రహం అవసరం.



కానీ భక్తి మార్గంలో ప్రధానమైనది భగవంతునిపై నిష్కపటమైన ప్రేమ, విశ్వాసం మరియు శరణాగతి మాత్రమే. పాండిత్యం, కఠినమైన తపస్సు, లేదా ప్రత్యేక సాధనల అవసరం లేకుండానే ఎవరికైనా భక్తి సాధ్యమవుతుంది. చిన్నా, పెద్దా, విద్యావంతుడు, అక్షరాస్యత లేనివాడు అనే భేదం లేకుండా అందరికీ అందుబాటులో ఉండే ఒకే ఒక మార్గము భక్తి మాత్రమే. భగవంతుడు ప్రేమకు స్పందించేవాడు కాబట్టి భక్తి మార్గంలో ఇతర మార్గాల కంటే సులభంగా ఆయనను పొందవచ్చు. అంతేకాక స్వాభావిక నైజమైన ప్రేమను ఆయన వైపు తిప్పడమే ఆయనను పొందే గొప్ప మార్గము.

గీతాచార్యులు భగవద్గీతలో **"అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః। తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥"** అంటూ "అనన్య చిత్తముతో నన్నే ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండే యోగులు నిరంతరం నా యందే నిమగ్నమై వుంటారు కాబట్టి, నేను వారికి సులభముగానే దొరుకుతాను" అని వివరిస్తారు.

అదే విధంగా శ్రీమద్ భాగవతంలో కూడా ప్రహ్లాదుడు తన స్నేహితులతో **"న దానం న తపో నేజ్యా న శౌచం న వ్రతాని చ ।ని ప్రీయతేఽ మలయా భక్త్యా హరిరన్యద్ విడంబనమ్ ॥"** భక్తి గురించి వివరిస్తూ "దానం, తపస్సు, యజ్ఞాలు, పూజలు, ఇవన్నీ చేస్తే మాత్రమే భగవంతుడు తప్పనిసరిగా సంతోషిస్తాడని లేదు. నిష్కళంకమైన (అమలమైన) భక్తితో మాత్రమే భగవంతుడు నిజంగా ప్రీతి చెందుతాడనీ, భక్తి లోపిస్తే మిగతావన్నీ బాహ్య ఆడంబరమే అవుతాయని" తెలియజేస్తాడు.

పైన చెప్పిన విధంగా ఈ సూత్రములో నారదులు భగవంతుడిని చేరడానికి మిగతా సాధనముల కంటే భక్తియే సులభమని స్పష్టం చేస్తున్నారు.

**భక్తి సూత్రము 59: ప్రమాణాంతరస్య అనపేక్షత్వాత్ స్వయం ప్రమాణత్వాత్**

**తాత్పర్యము**: భక్తిని తెలుసుకోవడానికి ఇతర ప్రమాణాలు అవసరం లేదు. దానికి అదే ప్రమాణము. ఈ సూత్రములో నారదులు భక్తికి అది ఒకటే ప్రమాణమని ఇతరములేవీ ప్రమాణములు కావని తెలియజేస్తున్నారు. ఏదైనా ఒక వస్తువును గుర్తించడానికి అన్య ప్రమాణములు అవసరమవుతాయి. అయితే ఇతర ప్రమాణములకు అందడానికి భక్తి ఒక వస్తువు కాదు. భక్తి అన్నది కేవలం అనుభవైక వేద్యమయినది.

"స్వతః ప్రమాణము"గా చెప్పబడిన వేదాలకు వేదాలే ప్రమాణము తప్ప మరొకటి ప్రమాణం కాదు. ఒక విధముగా భక్తి కూడా అదే కోవకు చెందుతుంది. అనుభూతితో మాత్రమే తెలియబడుతుంది. భక్తి అనేది ఇతర ప్రమాణాలైన తర్కం, శాస్త్రసాక్ష్యం లేదా బాహ్య నిరూపణలపై ఆధారపడని అనుభవమని ఈ సూత్రం తెలియజేస్తుంది.

సాధారణంగా సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రత్యక్షం, అనుమానం, శబ్దం వంటి ప్రమాణాలు అవసరం అవుతాయి. కానీ భక్తి హృదయానుభూతి కావున దానిని వేరే ప్రమాణాలతో నిరూపించాల్సిన అవసరం ఉండదు. భగవంతునిపై ప్రేమ, అనురాగం, విశ్వాసం భక్తుని అంతరంగంలో ప్రత్యక్షంగా అనుభూతి అవుతాయి. అదే దానికి సాక్ష్యం. తల్లి తన బిడ్డను ప్రేమించడం నిరూపించాల్సిన అవసరం లేనట్లే భక్తి కూడా స్వయంగా అనుభవంలో వెలిసే సత్యం. అందువల్ల భక్తి ఇతర ప్రమాణాలపై ఆధారపడకుండా తానే స్వయంప్రమాణంగా నిలుస్తుందని నారద మహర్షి ఈ సూత్రంలో ప్రకటిస్తున్నారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులు, ఆశ్రితాశ్రమవాసులు అయిన శ్రీమతి చవటపల్లి నాగమణి గారు 28-2-26 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 66 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఏప్రియల్ 2026**

2 గురు - చైత్రపూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.

12 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

15 బుధ - మాస శివరాత్రి

17 శుక్ర - అమావాస్య

20 సోమ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

21 మంగళ - శ్రీ శంకరజయంతి - శ్రీబాబు బృందావన మూర్తి ప్రతిష్ఠ 31వ వార్షికోత్సవం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**మే 2026**

1 శుక్ర - (వైశాఖ) గురు పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

4 సోమ వైశాఖ బహుళ తదియ - ఆశ్రమ స్థాపిత 54వ వార్షికోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

6 బుధ - వైశాఖ బహుళ పంచమి - శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారల ప్రతిష్ఠా వార్షికోత్సవము, రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

12 మంగళ - శ్రీగురుదశమి, శ్రీ హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

15 శుక్ర - మాస శివరాత్రి

16 శని - అమావాస్య

31 ఆది - 54 వ ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవము, అధిక జ్యేష్ఠ పూర్ణిమ, శ్రీ సద్గురుపాదపూజ.

# ఇతరులకు ప్రవేశము లేదు

- పెనుమాక నాగేశ్వర రావు

**ఒరులేయవి యొనరించిన నరవర! యప్రియము దన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్.** ఇతరులు ఏ పని చేస్తే మనకు బాధ కలుగుతుందో ఆ పని ఇతరుల విషయంలో చేయగూడదు. అదే పరమ ధర్మం. ఇదీ ఈ పద్యానికి అర్థంగా చెప్పబడింది. **ధర్మో రక్షతి రక్షితః** అని కదా ఆర్యోక్తి. మరి ఇంత పరమధర్మాన్ని ఆచరణలో చూపగలుగుతున్న వారు ఎందరు? లక్షకో, కోటికో ఒకరో ఇద్దరో వుంటే వుండివుండవచ్చు. కానీ అత్యధికులు మాత్రం టిట్ ఫర్ టాట్, 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' అన్న రీతిలోనే లోకం పోకడ కనిపిస్తున్నది. ముల్లుని ముల్లుతోనే తీయాలనే విధానమే అనుసరించ బడుతున్నది.

చిన్న చిన్న విషయాల పట్ల కూడా అవతలి మనిషి మనతో వాదించినా, విభేదించినా మళ్ళీ ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురు చూడటమే కానీ వదిలేసి ప్రశాంతంగా ఉండగలిగిన వ్యక్తులు తారసపడితే నిజంగా వారికి పాదనమస్కారం చేసుకోవటంలో ఏమాత్రం తప్పు లేదు. కానీ కంట పడటం లేదే. మనల్ని అవమాన పరచినవారో, ఆటపట్టించినవారో ఎప్పుడెప్పుడు తారసపడతారో అని ఎదురుచూసి అవకాశం వచ్చినప్పుడు ప్రతీకారం తీర్చుకుని ఆనందపడే అల్పజీవులే తారసపడుతుంటారు.

సహజంగా. **ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా మాటలాడి అన్యుల మదిని నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ** అన్నారు కానీ, నిజానికి అలాంటివాడు లౌక్యుడనిపించుకుంటాడే గాని ధన్యుడవుతాడా అని సందేహం! **ఉపకారికి ఉపకారము విపరీతము కాదు సేయ అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడే నేర్పరి సుమతీ.** నేటి సమాజంలో నేర్పరులెందరు అనేది పెద్ద ప్రశ్న. లౌక్యులు అడుగడుగునా కనిపిస్తుంటారు గానీ, నేర్పరులెక్కడో, ఎప్పుడో ఆరకొరగా తటస్థపడుతున్నారు. మనవరకు మనకి గురుక్షేత్రం లోకి అనుమతి లభించింది. కాబట్టి మనం ఇతరుల జాబితా నుండి ఇవతల పడ్డాం. గురుకృపని అనుభవిస్తున్నాం. **సాధూనాం దర్శనం పుణ్యం**

అన్నట్లు మనకు అవన్నీ లభింపజేశారు సద్గురు మూర్తి. అందుచేత మనం ఇతరులం కాదు అన్న ధైర్యం కలిగింది. సంతోషం కలిగింది. ఆ ఆనందాన్ని కూడా అనుభవిస్తున్నాం. కష్టమైనా, సుఖమైనా ఆయనతోనే విన్నవించుకుంటున్నాం.

'నీ మనసులో సదా నన్నే నిలుపుకో, లేదా నా మనసులో నీకు స్థానాన్ని సంపాదించుకో. నీ రక్షణ బాధ్యత నాది' అనేది బాబూజీ ఉవాచ. మనందరి మనసుల్లో బాబూజీ ఉన్నారనేది నిర్వివాదాంశం. అయితే ఆయన మనసులో మనకి స్థానం సంపాదించుకోవటం వల్లనే ఆయన ప్రేమకు నోచుకున్నాం. అందుకే ఆయన మనలోని భయాన్ని పోగొడుతూ అభయం ఇస్తూ కాపాడుతున్నారు. శ్రీ బాబు చెప్పినట్లు ఈర్ష్య, అసూయ, ద్వేషం, ఓర్వలేనితనం లాంటివాటికి మనలోకి ప్రవేశం లేనప్పుడు మనకి ఆయన దగ్గర మరింత ఆంతరంగిక స్థానం దొరుకుతుంది. మన జన్మ సార్థకం అవుతుంది. వినయం నిజమైనది అయితేనే విలువ వుంటుంది. అరువు తెచ్చుకున్న అణకువ ఆవిరైపోవటం వాస్తవం. ఎదుగుతున్నాం కానీ ఒదగటం కష్టంగానే వుంటున్నది. ఓర్చుకోవటం నేర్చుకోవాల్సి వస్తున్నది.

ప్రార్థన చేస్తున్నామా, చెబుతున్నామా అని ఆలోచించుకోవాల్సిన అవసరం కనిపిస్తున్నది. ఏది ఏమైనా సహనం సహజంగా వుండాలి. అప్పడే మన మనసు ఇతర చింతనలు లేనిది నా మది అని హాయిగా పాడుకోగలుగుతుంది. భక్తిభావనకు తప్ప ఇతరములకు మన మనసులో ప్రవేశము లేకుండా చేసుకోగలిగితే మనకు తప్పక భగవంతుని అంతరంగ ప్రవేశం లభిస్తుంది. ఆత్మానందం లభిస్తుంది.

మన ప్రయత్నం మనం కొనసాగిస్తూనే మన అంతరంగాన్ని ప్రక్షాళన చేయమని సద్గురుమూర్తిని ప్రార్థించటం ఒక్కటే మనం చేయగలిగింది. ఓం నమో భగవతే కాళీప్రసాదాయ.

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

(గత సంచిక తరువాయి)

- జి. విజయకృష్ణ (బుజ్జి)

తన వంతుగా న్యూరాలజిస్ట్ మెదడు మరియు ఇ.సి.జి యొక్క సి.టి స్కాన్‌ను ఆదేశించాడు. అవన్నీ సానుకూల సంకేతాలను చూపించాయి. వయస్సు సంబంధిత నష్టం తప్ప, కానీ మెదడు పపిల్లరీ లైట్ రిఫ్లెక్స్‌కు దాదాపు బలహీనంగా స్పందించింది. వారు నా కోలుకునే అవకాశాలను చాలా తక్కువగా ఉంచారు. ప్రతి ఒక్కరూ ఫలితం కోసం ఎదురు చూస్తుండగా బాహ్య ఉద్దీపనలకు ప్రతిస్పందించడానికి వారు నాకు 72 గంటలు ఇచ్చారు. ఈ 72 గంటలు గడిచేకొద్దీ, గుండె ఆగిపోయిన అనేక సందర్భాల్లో గుండె నుండి రక్త సరఫరా అంతరాయం కారణంగా నాకు మూత్రపిండాలు వైఫల్యం చెందాయని వారు గ్రహించారు. అందువల్ల నన్ను దాదాపు 48 గంటలు డయాలసిస్‌లో ఉంచారు.

ఇది ముందుకు సాగుతున్న కొద్దీ నా కాలేయం బిలిరుబిన్ కౌంట్ ఎగువ పరిమితికి 100 రెట్లు పెరిగింది. ఇది అసాధారణమైన యాంటీబయాటిక్స్ ఇన్ఫ్యూషన్ ద్వారా నియంత్రించబడింది. దీనికి నేను సానుకూలంగా స్పందించాను. ఒక్క మాటలో చెప్పాలంటే నేను కోలుకునే మార్గంలో కుంటుతూ ఉండగా, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అందరు నిపుణులు (గైనకాలజీ తప్ప) అత్యంత అప్రమత్తంగా ఉన్నారు. బాహ్య ఉద్దీపనలకు, కుటుంబ సభ్యుల స్వరాలకు నేను ప్రతిస్పందించడంతో క్రమంగా నేను పునరుజ్జీవన సంకేతాలను చూపించాను. అప్పుడే వారు నా మెదడు ఇంకా చెక్కుచెదరకుండా ఉందని ప్రకటించారు. ఇది వైద్య చరిత్రలో తెలియని అద్భుతం. నేను నెమ్మదిగా వెంటిలేటర్ మరియు ఐ.ఎ.బి.పి నుండి బయటకు తీసుకురాబడ్డాను. నా కోలుకోవడం క్రమంగా పురోగమిస్తున్నప్పుడు, నేను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యే వరకు రోగలక్షణ చికిత్స పొందాను.

ఈ మొత్తం సంఘటన సమయంలో నా కుటుంబ సభ్యులకు పూజ్య మాతాజీ యొక్క దృఢమైన మద్దతు, మార్గదర్శకత్వం లభించింది, ఈ మొత్తం కార్యక్రమాన్ని ధైర్యం మరియు నమ్మకంగా దాటడానికి. ఆమె ప్రతిరోజూ నా సోదరి, నా భార్య శివ కవచం, లలితా సహస్ర నామాలు మరియు ఆదిత్య హృదయం వంటి వాటిని జపించడంలో వారికి మార్గనిర్దేశం చేస్తూ, నన్ను మరో ప్రపంచానికి ప్రయాణం బారి నుండి రక్షించడానికి సందర్భానికి తగినట్లుగా చేశారు. ఆశ్రమం నుండి క్రమం తప్పకుండా తీర్థం సరఫరా చేయడం మరియు మా నిత్య సంరక్షకుడు శివుడికి అభిషేకాలు చేయడం ఈ గండం నుండి కోలుకోవడానికి నాకు సహాయపడింది. తన శిష్యుల పట్ల ఆమెకున్న శాశ్వతమైన ప్రేమ అన్ని ఒడిదుడుకుల ద్వారా మమ్మల్ని

నడిపిస్తుందని మా అందరికీ భరోసా ఇవ్వడానికి అమ్మ కూడా ఆసుపత్రిలో నన్ను సందర్శించించారు.

ఒక రాత్రి ఆసుపత్రిలో కోలుకుంటున్నప్పుడు, నా కుమార్తె నా నిద్ర విధానంలో తేడాను గమనించి, దానిని వైద్యుడికి నివేదించింది. అతను వెంటనే దానిని నిర్ధారించడానికి నిద్ర పరీక్ష చేయమని ఆదేశించాడు. ఆసుపత్రిలో ఎనిమిది గంటల పాటు నాపై నిద్ర అధ్యయనం జరిగింది. ఈ సౌకర్యం రెండు తెలుగు రాష్ట్రాలలో చాలా తక్కువ ప్రదేశాలలో అందుబాటులో ఉంది. నివేదికను అధ్యయనం చేసిన పల్మోనాలజిస్ట్ మెదడు దాని నిర్ణీత వ్యవధిలో శ్వాస తీసుకోవడానికి ఊపిరితిత్తులకు తగిన సంకేతాలను పంపడం లేదని, దీనిని తగిన విధంగా సరిదిద్దాల్సిన అవసరం ఉందని నిర్ధారించారు. ఎందుకంటే ఈ పరిస్థితిని సరిగ్గా పరిష్కరించకపోతే ప్రాణాంతకం కావచ్చు. నేను సెంట్రల్ స్లీప్ అప్నియా అని పిలువబడే స్లీప్ అప్నియా యొక్క మరింత సంక్లిష్టమైన వెర్షన్‌ను ఎదుర్కొన్నాను. సరళమైనదాన్ని అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా అని పిలుస్తారు. దాన్ని సరిచేయడానికి, నాకు సి.పి.ఎ.పి అని పిలువబడే బాహ్య శ్వాస యంత్ర మద్దతు లేదా బై పాప్ అని పిలువబడే మరొక వెర్షన్ అవసరం. అవి సాధారణంగా అద్దెకు లభిస్తాయి, కానీ నేను ఉన్న ప్రమాదకర పరిస్థితి కారణంగా, కనీసం రెండు సంవత్సరాల పాటు రాత్రిపూట ఈ యంత్రాన్ని నిరంతరం ఉపయోగించడం అవసరం కాబట్టి, దానిని సరిచేయడానికి నిపుణుడు కొనుగోలు చేయమని సలహా ఇచ్చాడు. యంత్రాన్ని తాత్కాలికంగా అద్దెకు తీసుకున్నారు. దానితో నా శ్రమ ప్రారంభమైంది, అది గదిలోకి ప్రవేశించగానే.

పల్మోనాలజిస్ట్ నిర్ణయించిన నిర్దిష్ట పీడనం వద్ద, యంత్రం ముసుగు ద్వారా ఊపిరితిత్తుల వాయుమార్గాల్లోకి గాలిని పంపుతుంది. ఇది రోగి పరిస్థితి ప్రకారం నిర్ణయించబడుతుంది. నా పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నందున యంత్రాన్ని గరిష్ట పనితీరుకు ట్యూన్ చేశారు. ఈ యంత్రం గదిలోకి వచ్చిన తర్వాత మొత్తం కుటుంబానికి జీవితం కష్టమైంది. ఎందుకంటే రాత్రి నిద్ర స్థితిలో ప్రతి కదలికతో ముక్కు ముసుగు లీక్ అవుతుంది, రాత్రంతా కదలని రాయిలా నిద్రపోవడం సాధ్యం కాదు. నిద్రలో ప్రతి మార్పుతో ముసుగు లీక్ అవుతుంది, యంత్రం అరుస్తుంది, మొత్తం కుటుంబం తక్షణమే మేల్కొంటుంది. రాత్రి మధ్యలో ఎటువంటి లీక్ లేకుండా ముసుగును తిరిగి ఉంచుతారు. అనేక ప్రయత్నాల తర్వాత, నా కుమార్తె మాత్రమే ఈ నైపుణ్యాన్ని నేర్చుకోగలిగింది. ఈ స్లీప్ అప్నియా ఉన్నంత వరకు ఆమె తన భర్తను విడిచిపెట్టి మాతోనే ఉండవలసి వస్తుందని మేము ఆందోళన చెందాము. ఈ ఆలోచన బాధను మరింత పెంచింది. ఈ బాధ నుండి మేము ఒక నెలలోనే బయటపడ్డాము.

ఆ తరవాత డాక్టర్ రిపీట్ స్లీప్ స్టడీని ఆదేశించారు. స్లీప్ క్లీనిక్‌లోని అటెండెంట్ సిబ్బంది అందరూ ఈ రిపీట్ స్లీప్ స్టడీ వ్యాయామంతో కొంచెం గందరగోళానికి గురయ్యారు. ఎందుకంటే ఇది సాధారణంగా రెండు సంవత్సరాలు తరువాత పునరావృత మవుతుంది. అన్ని సందేహాలు ఉన్నప్పటికీ, రిపీట్ స్లీప్ స్టడీ అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. అధ్యయనం నేను నిద్రపోతున్నప్పుడు బాహ్య మద్దతు అవసరం లేకుండా పరిపూర్ణ స్థితిలో ఉన్నానని ప్రకటించింది. (దయచేసి గమనించండి, అర్థం చేసుకోండి, గ్రహించండి మా గురువు యొక్క అద్భుతాలను ప్రతి దశలోనూ బాహాటం కాని, గుర్తించలేని విధంగా నడిపిస్తున్నారు) టెక్నీషియన్ చాలా ఆసక్తిగా నన్ను అడిగాడు, ఎందుకంటే నా పరిస్థితికి ఏదైనా సర్జరీ దిద్దుబాటు కోసం నేను విదేశాలకు వెళ్ళానా అని. ఇంత తక్కువ సమయంలో ఎవరూ సెంట్రల్ స్లీప్ అప్నియా పరిస్థితి నుండి బయటకు రావడాన్ని అతను ఎప్పుడూ చూడలేదు. గురుదేవులు నిశ్శబ్దంగా నా కుటుంబాన్ని ఆ అవస్థ నుండి బయటకు తీసుకువచ్చే పనిలో ఉన్నారు.

ఈ సంఘటనల క్రమాన్ని చెప్పిన తర్వాత, నేను ఈ మొత్తం ఆసుపత్రి(లు) నుండి బయటపడ్డానని చెప్పాలి, గొప్ప వైద్యుల బృందం పని చేయడం వల్ల కాదు, మన సద్గురు శ్రీ బాబూజీ యొక్క శాశ్వత కృప వల్ల. ఇది కూడా హాజరైన ప్రధాన వైద్యుడు డాక్టర్ నరసింహన్ చేసిన బహిరంగ ఒప్పుకోలు. నేను డిశ్చార్జ్ అయిన తర్వాత, నా ప్రాణాన్ని కాపాడినందుకు ఆయనకు చాలా కృతజ్ఞతలు చెప్పడానికి నేను ఆయనను కలిసినప్పుడు, ఆయన చాలా వినయంగా చెప్పింది "ఇది దైవిక హస్తం పని మాత్రమే" అని. నా ఇన్ని సంవత్సరాల సేవలో, మీరు ఉన్న స్థితిలో మా వద్దకు వచ్చి ప్రాణాలతో బయటపడిన వ్యక్తిని నేను చూడలేదు. "స్పష్టంగా, మీరు ఇక్కడ లేదా వైజాగ్ నుండి హైదరాబాద్‌కు వెళ్లేటప్పుడు ఎన్ని గుండెపోటులు ఎదుర్కొన్నారో మేము లెక్కించలేదు, కానీ మీరు బ్రతికి బయటపడ్డారు, ఎందుకంటే మీరు అనుభవించిన దైవిక రక్షణ వల్లనే".

ఈ ఎపిసోడ్‌ను మరింత ఆసక్తికరంగా చేసే విషయం ఏమిటంటే, మా సద్గురువు చాలా దయగలవారు. నేను వైజాగ్‌లో ఆసుపత్రిలో చేరిన సమయం నుండి నేను హైదరాబాద్‌లోని ఐసియు నుండి డిశ్చార్జ్ అయ్యే సమయం వరకు ఆయన నా మెమరీ మాడ్యూల్‌ను తొలగించారు. స్పష్టంగా, ఆయన దయ నా మనుగడను నిర్ధారించింది ఎందుకంటే తెలివిగల ఎవరైనా ఈ మొత్తం ఎపిసోడ్‌ను ఎదుర్కొంటే, అతను నాలాగా క్షేమంగా ఉండలేడు. వైజాగ్‌లో దాని అమరిక సమయం నుండి దానిని

లోపభూయిష్టం అని ప్రకటించే వరకు ఐ.సి.డి నాకు కలిగించిన ఎనభై విద్యుత్ షాక్‌లను భరించడం ఒక మనిషికి సాధ్యమయ్యేది కాదు. అంతేకాకుండా, ఈ మధ్యకాలంలో నేను బతికిన గుండెపోటుల సంఖ్య, అంబులెన్స్ ప్రయాణం మరియు హైదరాబాద్‌లో తక్కువ సమయం ఉండటం వైద్య చరిత్రలోని రికార్డులను ధిక్కరిస్తుంది. స్పష్టంగా మన "అవ్యాజ కరుణమూర్తి" శ్రీ బాబూజీ చేతిపని.

ఈ కార్యక్రమం జరగడానికి వేచి ఉన్నట్లుగా, ఆసుపత్రిలో నా సహాయకులుగా ఉన్న వారందరూ పూర్తిగా ఖాళీగా ఉండటంతో ఈ కార్యక్రమం జరగడం చాలా ఆసక్తికరంగా మారింది. మొదటగా, నా కుమార్తె తన మెడికల్ పిజి ప్రవేశానికి సిద్ధమవుతూ ఉంది. తరువాత ఆమె పిజి కోర్సులో చేరినప్పటి నుండి బిజీగా ఉంది. నన్ను రక్షించడానికి పరుగెత్తిన నా అల్లుడు అప్పటి నుండి మిడ్ లెవల్ రిఫ్రెషర్ కోర్సులో బిజీగా ఉన్నాడు. నాకు 24/7 సేవ చేసిన నా మేనల్లుళ్ళు ఇద్దరూ బిజీగా ఉన్నారు, ఒకరు టిసిఎస్‌లో ఉద్యోగ అవకాశంతో మరియు మరొకరు ఎంబిఎ కోర్సులో ప్రవేశంతో. ఈ మొత్తం సంఘటనను సరైన సమయంలో నడిపించడంలో గురుదేవుల ప్రణాళిక మరోసారి రుజువు అయింది. ఈ సంఘటన ఇప్పుడు జరిగి ఉంటే ఆ కుటుంబానికి ఆ అనుభవం మరింత బాధాకరంగా ఉండేది, ఆసుపత్రి పనులన్నింటికీ సహాయం లేకుండా ఉండేది.

(10వ పేజీ తరువాయి భాగం............)

ఇతరులు ఏమి చేస్తే నీ మనస్సుకు బాధ కలుగుతోందో అది నువ్వు ఇతరులకు చేయకుండా ఉండటమే అన్ని ధర్మాలలోకి ఉత్తమమైన ధర్మం అని మహాభారతం చెబుతోంది. చివరికి తన భార్యను అపహరించిన రావణునికి శ్రీరాముడు, తమ రాజ్యాన్ని అపహరించి, భార్యను అవమానించిన కౌరవులకు పాండవులు కూడా సంధికి అనేక అవకాశాలు ఇచ్చి గతిలేని పరిస్థితిలోనే యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో కూడా తమ పక్షానికి వస్తానన్న శత్రువులను సాదరంగా ఆహ్వానించారు. అలాగే యుద్ధంలో మరణించిన తరువాత శత్రువులను కూడా గౌరవించారు, వారికి ఉత్తమగతులు కల్పించే క్రతువులను నిర్వహించారు. అంతేకానీ కులమత సంకుచిత భావనలతో ఎదుటివారిని నిష్కారణంగా హింసిస్తూ, మహాత్ములను అవమానిస్తూ ఉండేవారికి సర్వజీవ సమభావనకు ఉత్కృష్ట ప్రతీక అయిన పరమేశ్వరుని చేతిలో శిక్ష తప్పదు. అలాగే వారిని ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ప్రోత్సహించేవారికి, చూసీ చూడనట్లు ఊరుకొనే వారికి కూడా పళ్ళు రాలడం తప్పదు. అధర్మాన్ని ఖండించని మౌనం కూడా అధర్మంలో భాగస్వామే.

## శ్రీ బాబూజీతో నా అనుభవాలు

-ఎన్. కుట్టీ

1980వ సంవత్సరంలో మా పెద్ద అబ్బాయికి 5 సం॥ల వయస్సు. మేము హైదరాబాద్‌లో శ్రీరామ్ నగర్ కాలనీలో వుండేవాళ్లం. మా వాడు పిట్టగోడ ఎక్కి, క్రిందపడ్డాడు. ఎడమ చెయ్యి విరిగింది. సమయం సాయంత్రం 6గం.లు అయింది. నేను, మా అన్నయ్య శ్రీనివాసరావు కలిసి, పిల్లవాడిని ఉస్మానియా హాస్పిటల్‌కు రాత్రి 7గం.లకు తీసుకు వెళ్ళాము. పిల్లవాడు నొప్పితో ఏడుస్తున్నాడు. ఆ ఆసుపత్రిలో సీనియర్ సర్జన్ మేజర్ ఆపరేషన్ చేస్తున్నారు, ఆయన వచ్చి చూస్తారు. అప్పటి దాకా ఎదురు చూడండి అని అక్కడి నర్స్ చెప్పారు.

ఆ డాక్టర్ ఆ ఆపరేషన్ పూర్తి చేసుకుని, బాగా అలసిపోయి, రాత్రి 11గం.లకు బయటకు వచ్చారు. వారు రాగానే 'మా అబ్బాయికి చెయ్యి ఫ్రాక్చర్ అయింది. మేము 7గం. నుండి మీ కోసం ఎదురు చూస్తున్నాము' అని చెప్పాము. ఆయన మాతో 'నేను మేజర్ ఆపరేషన్ చేసి, బాగా అలసిపోయాను. మా అసిస్టెంట్ డాక్టర్ చూస్తారు' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ డాక్టర్ వచ్చి చూసి, చెయ్యి సెట్ చేసి, తిరిగి 15 రోజుల తరువాత రమ్మనమన్నారు.

15 రోజుల తరువాత చూస్తే చెయ్యి ఇంకా బాగా వంకరగా వున్నది. మేము తిరిగి ఆ ఆసుపత్రికి తీసుకువెళ్ళాము. ఆ అసిస్టెంట్ డాక్టర్‌కి చూపించి, 'సార్! మా పిల్లవాడి చెయ్యి బాగా వంకరగా వుంది. అది సరిగా సెట్ అయినట్లు లేదు' అన్నాము. అప్పుడు ఆ డాక్టర్ చాలా కోపంతో 'అంతా బాగానే వుంది. అసలు డాక్టర్‌ని నేనా? లేక మీరా? నాకు తెలుసా? లేక నాకంటే ఎక్కువగా మీకు తెలుస్తుందా?' అని కోపంతో అరచి మరొక 15 రోజులు పోయాక రమ్మనమన్నారు.


మళ్ళీ 15 రోజులు అయ్యాక తిరిగి ఆదే ఆసుపత్రికి, ఆ అసిస్టెంట్ దగ్గరకే వెళ్ళి, ఆయనకు పిల్లవాడిని చూపించి, "అయ్యా! చెయ్యి చాలా వంకరగా వుంది. మేము 15రోజుల క్రిందటే మీకు ఆ విషయం చెబితే మీరు కోపంతా 'నేనా డాక్టర్‌ని లేక మీరా? నాకు తెలుస్తుందా, లేక మీకు తెలుస్తుందా?' అని అరిచారు. ఇప్పుడు చూసి మీరే చెప్పండి" అన్నాము. అప్పుడు ఆ డాక్టర్ చూసి, 'చేతిని విరగగొట్టి తిరిగి కట్టాలి'

అన్నారు. అప్పుడు నేనూ, మా అన్నయ్య కూడా 'అసలు నువ్వు డాక్టర్‌వేనా? నీకు ట్రీట్‌మెంట్ చేయడం వచ్చా?' అని తిట్టి పిల్లవాడిని తీసుకుని బయటకు వచ్చేశాము.

అప్పుడు మేము, మహావీర్ ఆసుపత్రి, నిమ్స్ ఆసుపత్రి ఆ రెండిటికి కూడా తీసుకువెళ్ళి పిల్లవాడిని చూపించాము. వాళ్ళు కూడా 'చెయ్యి బాగా వంకర పోయింది. విరగ గొట్టి తిరిగి కట్టు కట్టాలి' అన్నారు.

అప్పుడు మా అబ్బాయిని శ్రీ బాబు దగ్గరకు తీసుకు వచ్చి, చూపించి, జరిగినదంతా చెప్పాము. శ్రీబాబు ఆ విరిగిన చెయ్యి చూసి, 'ఎవరురా! ఆ తలమాసిన డాక్టర్ తిరిగి విరగగొట్టి కట్టమన్నవారు?' అన్నారు. నేను చేస్తాను చూడు అని చెప్పి క్రిందకు వెళ్ళు మన వాళ్ళు ఆయుర్వేదం కట్టు కడతారు అని చెప్పారు. అలా ఆ కట్టుతో వారం రోజులు వుండమన్నారు.

శ్రీబాబు దయతో ఆ చెయ్యి సెట్ అయింది. లేకపోతే అసలే విరిగిన ఆ చేతిని తిరిగి విరగగొడితే ఎలా వుండేదో! ఏమయ్యేవారమో! అంతా బాబు దయ! బాబు దివ్యానుగ్రహంతో మా వాడు తిరిగి నార్మల్‌గా అయ్యాడు!!



**నిజమైన సత్యగురువు లభ్యమయినప్పుడు జన్మాంతర వాసనలు అన్నీ పటాపంచలవుతాయి. పరిపూర్ణమైన ఆనందం, సంపద, ఐశ్వర్యాలు సంప్రాప్తమవుతాయి. సత్యగురువు కృపా వీక్షణాలు సదా ప్రసారమయ్యే గృహం ఆనందదాయకమే అవుతుంది.**

- శ్రీ కాళీబాబు

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

తన ముంగిట నిలుపబడిన హనుమంతుని జూచి, ఆగ్రహావేశముతో నిండియున్న రావణుడు, "ఓ వానరా! నీవెవరవు?" అని ప్రశ్నించాడు. "చక్రధారియైన మహావిష్ణువువా!? వజ్రాయుధుడైన ఇంద్రునివా? పొడుగాటి శూలాయుధమును ధరించు ఈశ్వరుడివా? తామరపై అమరియుండు బ్రహ్మవా? భయములేక సహస్ర శిరస్సులతో ఈ భూమిని మోయుచున్న ఆదిశేషునివా? నీ నామమును నిజరూపమును దాచియుంచి, పోరాటముచేసి నాశనమొంద ఇచ్చోటకు విచ్చేసితివా?"

సిరిసంపదలతో తులతూగుచున్న రావణుని రాజసభను చూడడమేగాక తన సామగానముతో ఆ పరమేశ్వరుని మెప్పుపొందిన కళతో నిండిన మోముగల లంకాధిపతి రావణుని గాంచి, ఆశ్చర్యముతో 'ఇంత ఉన్నత స్థితిలో ఉండియూ ఇతరుల భార్యలను అపహరించు నీచ కార్యమునకు ఈతడు పాల్పడనేల!?' అని తలచాడు హనుమంతుడు.

పిదప తనను రామదూతగ పరిచయమొనరించుకుని, "లంకానగరాధిపతీ! నీకు సద్బుద్ధి కలిగించుటకే నేను ఇచ్చటకు విచ్చేసితిని. నిన్ను తన తోకతో కట్టివేసిన వాడు, గతమున ఏడు సముద్రములందు నీరాడిన వాలిని సునాయాసముగ సంహరించిన నా దైవము రాముడు. నిన్ను అనేక కష్టములకు గురిచేసిన కార్తవీర్యార్జునుని సంహరించిన పరశురాముని అహమును అణచివేసినవాడు నా దైవము. ఆతని భార్యయైన సీతను వంచనతో అపహరించి తీసుకుని వచ్చితివి. మహావీరుడైన ఆ రామునికి ఆతని భార్యను అప్పగించి వినయముతో శరణు వేడుకొనుము. ఆ శరణాగత వత్సలుడు నీకు తప్పక మోక్షమును ప్రసాదించును. లేనిచో నీవు, నీ అసురకులమంతయూ నాశనమగుట తథ్యము" అన్నాడు.

రావణుని ఇరవై నేత్రములనుండి నిప్పురవ్వలు వెదజల్లబడ్డాయి. "ఎవరక్కడ! మదమొందిన ఈ వానరుని నరకివేయుము" అని గర్జించాడు. ఆ సమయమున ఆతని చిన్న తమ్ముడైన విభీషణుడు, "అన్నా! ఈతడు తాను దూతగ పరిచయము చేసుకున్నాడు గనుక ఆతనిని సంహరించుట రాజ ధర్మము కాదు" అన్నాడు. దానికి రావణుడు, "ఓహో! అటులనా! అయితే ఈ వానరుని తోకకు గుడ్డను చుట్టి ఆ గుడ్డకు నిప్పంటించి పంపివేయండి. అదియే ఈతనికి సరైన దండన. ఒక వానరునికి తోకయేకదా గొప్పది!" అన్నాడు.

రావణుని ఆజ్ఞను వినిన అశోకవనమందలి రాక్షస స్త్రీలందరూ సీతకు ఈ విషయమును తెలియజేసి, "దూరంలో వేమున్ననూ ఆ వానరుడు మీతో సంభాషించుటను మేము గమనించాము. హద్దుమీరి ఇచ్చటకు వచ్చిన ఆతనికి తోకకు

నిప్పంటించి వదలివేయుటయే తగినశిక్ష" అన్నారు ఏకగ్రీవంగా. ఈ విషయమును వినిన సీత హృదయము కలతకు లోనైంది. "ఓ అగ్నిదేవా! నేను శీలవంతురాలనైనచో, నా భర్తయైన రాముడు నన్ను తప్ప వేరొక స్త్రీని ఇష్టపడడన్నది సత్యమైనచో, నా పుత్రుడైన హనుమంతుని నీ వేడి దహింపక చల్లబరచుగాక" అని మనసులో తలచుకుంది.

హనుమంతునికి ఒకటే ఆశ్చర్యం. "ఇదేమి వినోదం!? అగ్ని నన్ను కాల్చుటలేదే!? ఓహో ఒకవేళ ఇది అమ్మ సీతయొక్క ఆశీర్వాదబలమేమో!?" అనుకున్నాడు. మరుక్షణం నిప్పంటించబడిన తన తోకతో అన్ని దిక్కులకూ వెడలి, లంకానగర రాజధానియందలి పలు భవంతులను, తోటలను అగ్నికి ఆహుతి చేసాడు.

'అయ్యో! తప్పుజేశానే! అశోకవనముకూడ కాలి మండుచున్నదో ఏమో!' అని ఒక్క క్షణం బాధకులోనైన ఆతని చెవులకు "ఆహా! ఏమి హనుమంతుని చాతుర్యము! అశోకవనముపై అగ్నిపడకుండా జూచి ఇతర తోటలు, భవనములన్నింటినీ కాల్చి బూడిద చేసాడే!' అని ఆకాశమందు సంచరించు దేవగణముల మాటలు అమృతము పోశాయా అన్నట్లు వినపడ్డాయి. నిప్పంటిన తన తోకను సముద్రమందలి నీటిలో ముంచి, ఆర్పివేసి, మరల అశోకవనముకేగి, అమ్మ సీతకు వందనమొసగి, "తండ్రి రాముడు, చిన్నవాడైన లక్ష్మణుడు, మా రాజు సుగ్రీవుడు మిమ్ములను విడిపించి కొనిపోవ త్వరలో ఇచ్చటకు వచ్చెదరు. దయచేసి పొరపాటుగనైననూ ఎట్టి తీవ్ర నిర్ణయమూ తీసుకోకండి. రాముడు వచ్చువరకు నిరీక్షించుము" అని చెప్పి ఆమెనుండి సెలవు తీసుకున్నాడు.

పిదప లంకాతీరమందున్న అరిష్టము అనబడు కొండపైకి ఎక్కి, అక్కడనుండి పడమట దిశవైపుకు ఎగిరాడు. ఇక, రామునితో సహా అందరికీ హనుమంతుని రాక కొరకు నిరీక్షణయే. 'తిరుగు పయనమై వచ్చు సమయమున నీపై విశ్రాంతి తీసుకుంటాను' అని చెప్పిన తనకోసం ఆశతో నిరీక్షిస్తున్న మైనాక కొండను ప్రేమతో నిమిరి, తన రాక కొరకు సముద్రతీరమందు ఆశతో ఎదురుచూస్తున్న జాంబవంతుడు, అంగదుడు మొదలైన వారిని ఆనందపరచు విధమున 'చూసితిని సీతను' అని పెద్ద శబ్దముతో అరచి తీరమును చేరుకున్నాడు. వానరులందరూ హనుమంతుని ఆలింగన మొనర్చుకున్నారు. వారికి జరిగిన విషయమంతటినీ వివరముగ తెలియజేసి "ఇక ఆలసించవలదు. తండ్రి శుభవార్త కొరకు కాచుకుని ఉన్నారు. మనము వెంటనే కిష్కింధకు వెళ్ళాలి" అని హనుమ చెప్పినంతనే వారంతా బయలుదేరారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

తనకుల ధర్మాన్ని విడిస్తే ధర్మచ్యుతి అవుతుందని కుల ధర్మాన్నే పట్టుకొని వదలకుండా ఆచరిస్తూ మరణిస్తే, వాడికి మళ్ళీ తరువాత జన్మలో మానవత్వమూ, అదే కులమూ లభిస్తుందని నమ్మకము లేదు. ఎందువలన నంటే జన్మము ప్రారబ్ధమును బట్టి కలుగుతుంది. ఆ ప్రారబ్ధం ఎన్నో జన్మల పుణ్య పాప మిశ్రితమైన సంచితములో భాగము కనుక యీ జన్మలో కర్మిష్టియైన విప్రుడు రాబోయే జన్మలో విప్రుడుగా జన్మిస్తాడనే నమ్మకం లేదు. గురువును (భగవంతుని) నమ్మిన భక్తులు యీ జన్మలో ముక్తులు కాలేకపోయినను మరుజన్మలో ఏ కులంలో పుట్టినా ముక్తులౌతారనటం శాస్త్రం ప్రకటించే సత్యం.

*వర్ణాశ్రమ ధర్మంబుల*
*నిర్ణయ కర్మముల జెడక, నిఖిల జగత్సం*
*పూర్ణుడు హరియనునాతడె*
*వర్ణింపగ భాగవతుడు వసుధాధీశా!* (భాగవతము-11-2-4)

అని భాగవత నిర్ణయము. ఈ పద్యంలో మూడవ పాదంలో "హరియను" అనే చోట "గురువను" అని మార్చుకొంటే ఈ శ్లోకానికి చక్కని వ్యాఖ్యానం అవుతుంది.

**అనన్యాశ్చింత యంతో యే సులభం పరమం సుఖం**
**తస్మాత్సర్వ ప్రయత్నేన గురోరారాధనంకురు.** **42**

**పదవిభాగము** :-

అనన్యాః-చింతయంతః-యే-సులభం-పరమం-సుఖం-తస్మాత్-సర్వప్రయత్నేన-గురోః-ఆరాధనం-కురు.

**టీక** :- యే=ఏ గురు భక్తులు; అనన్యాః=ఇతర భావములేనివాడై; వేరు శరణము లేనివాడై; చింతయంతః=గురుదేవునే ధ్యానించుచుందురో (వారు);

పరమం సుఖమ్=అత్యంత సుఖమును (బ్రహ్మానందమును); సులభం=తేలికగా (పొందెదరు); తస్మాత్=ఆ కారణము వలన; సర్వప్రయత్నేన= సర్వ విధములైన ప్రయత్నములు చేసి; గురోః=శ్రీ గురుదేవుని; ఆరాధనం= సేవను; కురు= చేయుము.

**వ్యాఖ్య** :- "ఏ శిష్యులు అన్య భావమనేది లేక శ్రీ గురుదేవునే ధ్యానిస్తూ వుంటారో, వారు బ్రహ్మానందమనే పరమ సుఖాన్ని తేలికగా పొందుతారు, అందుచేత చేయ వీలైన అన్ని ప్రయత్నములూ చేసి శ్రీ గురుదేవుని సేవ చేయువలెను" అని కర్తవ్యాన్ని విధి వాక్య రూపంగా సెలవిస్తున్నాడు పరమేశ్వరుడు. గురుసేవకు ఫలితం అన్యం కాదు, 'తానే ఆనంద స్వరూపుడైన పరమాత్మ' అని గుర్తించటమే.

అందువల్లనే కాళీ వనాశ్రమ పీఠాధిపతి శ్రీ యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ వారు "గుర్తు తెలిపే వారే గురుదేవులు" అంటారు. గురుసేవ అనే సాధనకు వేరే సాధ్యంలేదు. గురుసేవే సాధనమూ సాధ్యమూ కూడ, ఇది 'అనన్య చింతనం' వల్లనే సాధ్యం.

భగవద్గీతలో శ్రీ కృష్ణస్వామి కూడ యిదే భావాన్ని "**అనన్య చేతాస్సతతం యోమాంస్మరతి నిత్యశః**" (8-14) అన్నచోటా, "**అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే**" (9-22) అన్నచోటా వ్యక్తంచేస్తాడు. జగత్తనగా విషయ సముదాయము, ఇది ఉన్నదనుకొన్నంత కాలమూ మనస్సు ప్రియ, మోద, ప్రమోదములలో కొట్టుమిట్టులాడుతూ ఉంటుంది.

గురుకృపవల్ల "**ఏకమేవాద్వితీయం బ్రహ్మ**" అనే జ్ఞానం కలిగి, గురువే సర్వస్వమని అనన్య భావానికి చేరుకొన్న వాడికి కోరటానికి విషయాలూ, ఆచరించటానికి కర్మలూ సహజముగానే రహితమైపోయి కేవలానందము మాత్రమే స్వరూపముగా మిగులుతుంది.

- సశేషం

# గురుకృప

(గత సంచిక తరువాయి)

కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

ట్రైనింగు పూర్తయ్యాక ఉద్యోగం ఇంకా రాలేదని బాధపడుతూ శ్రీబాబుకు చెప్పగా, "నేను అదే చూస్తున్నాను, రెండవ లిస్టులో మూడవ పేరు నీదే వచ్చేస్తుంది." అని శ్రీబాబు అన్న కొద్ది రోజులకే నరసమ్మగారిని ఇంటర్వ్యూకి రమ్మనడం, ఉద్యోగం వచ్చేయడం జరిగిపోయాయి. జీవితంలో ఎన్ని పరీక్షలు, సవాళ్లు ఉన్నా కూడా గురుపదములను దృఢంగా నమ్మినవారికి గురుదేవుల కృపారసము అన్ని వేళలా వారిపై వర్షిస్తూ ఉంటుంది.

నరసమ్మగారికి పశ్చిమగోదావరి జిల్లా చిలుకూరులో ఉద్యోగం వచ్చింది. కొన్ని రోజులకే ఆవిడ బావగారు 'ఉండి'కి బదిలీ ప్రయత్నించి ఆవిడచే సంతకాలు కూడా పెట్టించేశారు. ఆదివారం సెలవురోజున శ్రీబాబు దర్శనార్థం భీమవరం వచ్చినప్పుడు శ్రీబాబు ఆవిడతో, "ఎంత పని చేశావ్?! పోనీలే మీ బావగారి మాటకు గౌరవం ఇచ్చినట్లు అయింది, నీకు బదిలీ కాకుండా కూడా జరిగింది, ఆ పోస్టు ఖాళీది. ఇంక అక్కడ నుంచి నిన్ను ఎవరు కదపరని అక్కడ వేయించాను, ఇక బదిలీ విషయం ప్రయత్నించకు" అని అన్నారు శ్రీబాబు.

శ్రీబాబు తమ భోదామృతంలో ఎన్నోసార్లు, "మీరు బాబు అంటే పలుకుతా, అమ్మ అంటే పలుకుతా. మీరు విశ్వసించి ఆర్తితో పిలిస్తే పలుకుతా. రోగం వచ్చినప్పుడు "డాక్టర్, డాక్టర్" అని అంటారు కానీ "నారాయణ" అని ఒక్కసారైనా పలుకడు, అప్పుడు డాక్టర్ జేబు గల్లుమంటుంది, మీ గొంతులు గొల్లుమంటాయి... భవరోగాలను తొలగించి ముక్తిని ప్రసాదించేది భగవన్నామం. దానిని ఎన్నిసార్లు అయిన, ఎక్కడైన, ఎంతసేపైనా, ఏ పని చేస్తున్నా కూడా చేయవచ్చు" అని అన్నారు. దానికి నిదర్శనంగా నరసమ్మగారు చిలుకూరులో పనిచేస్తున్నప్పుడు ఒక సంఘటన జరిగింది.

1969లో ఆవిడ తోటి ఉద్యోగస్తుడు ఒకరు సెలవు మీద రాకపోతే పనిభారం ఆమె మీద పడింది. పరీక్ష పత్రాలని దిద్దే సమయంలో ఆమె టైం చూసుకోకుండా రాత్రి 7:30 వరకు పనిలోనే ఉండిపోయారు. కానీ అప్పటికే ఆఖరి బస్సు వెళ్ళే సమయం కూడా దాటిపోయింది. ఆవిడ శ్రీబాబు నామస్మరణ చేసుకుంటూ కాలినడకన మహాదేవపట్నం-ఉండి రోడ్డుపై వెళ్తున్నారు. ఆవిడ అలసిపోయి ఏవైనా వాహనాలు వస్తాయేమో అని ఒకచోట ఆగగా అక్కడ కల్లు దుకాణం, కల్లు తాగుతూ కొంతమంది కనిపించారు. ఆమె భయంతో శ్రీబాబు నామస్మరణ ఇంకా ఎక్కువగా చేసుకోవడం మొదలుపెట్టారు. కొంత సమయం తరువాత ఒక కారు వచ్చి ఆవిడ ముందు ఆగింది. ఆ డ్రైవర్ సీట్లో ఉన్న వ్యక్తి, "ఎక్కడికి వెళ్ళాలమ్మ?! రండి నేను దింపుతాను, ఇంత రాత్రి

అయింది ఒంటరిగా వెళ్ళలేరు, రండి కారు ఎక్కండి" అని అన్నారు.ఆ వెనుక సీట్లో ఇద్దరు ఆడవారు ఉన్నారు. శ్రీబాబే తన కోసం ఈ ఏర్పాటు చేసి వుంటారు అని మనసులోనే శ్రీగురుదేవులకు నమస్కరించుకొని ఆవిడ కారులో కూర్చున్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత అతను కారు ఆపి ఆవిడతో, "అమ్మ! ఇక్కడ నుంచి మీరు వెళ్ళిపోగలరా?!" అని అడిగాడు. దానికి ఆవిడ "నేను వెళ్ళగలను" అని చెప్పి దిగి "థాంక్స్" అని చెప్పేలోపు ఆ కారు గానీ, ఆ వ్యక్తిగాని కనిపించలేదు. బాగా పొద్దుపోయింది కనుక ఆవిడకూడా అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

తరవాత ఒక శనివారంనాడు శ్రీబాబుజీ భీమవరం వచ్చారు అని తెలుసుకొని శ్రీబాబు దర్శనార్థం ఆవిడ వెళ్ళారు. శ్రీబాబు కుశల ప్రశ్నల తర్వాత ఆవిడతో, "ఎవడు కాపాడతాడు అని అంత రాత్రిపూట ఒంటరిగా వచ్చేశావు?!" అని అడిగారు. దానికి ఆవిడ "మీరు ఉన్నారని, మీరు రక్షిస్తారనే ధైర్యంతో మీ నామస్మరణే చేసుకుంటూ వచ్చాను బాబు" అన్నారు. దానికి చిరునవ్వుతో శ్రీబాబు, "సర్లే, పాదం పట్టావు కదా, ఎవరికి తప్పినా, నాకు తప్పదు. ఇక ఎప్పుడూ కూడా ఇలా రాత్రిపూట పనులు పెట్టుకోకు" అని హెచ్చరికచేసి, ఆశీర్వదించి పంపించారు. సర్వకాల సర్వావస్థలయందు శ్రీగురుదేవుల అపార కరుణా కటాక్ష వీక్షణాలు ఆయన పాదపద్మములను నమ్మిన వారిపై ఎల్లప్పుడూ వర్షిస్తూనే ఉంటాయి.

నరసమ్మగారు చిలుకూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆవిడ కుమార్తె జయకాళిని భీమవరంలోని తన అమ్మమ్మ వద్ద ఉంచి చదివించమని, ప్రతి శనివారం వచ్చి వెళ్తూ ఉండమని శ్రీబాబు ఆవిడతో అన్నారు. దానికి నరసమ్మగారు, "బాబు, మా అమ్మ పెద్దది, కాళి చూస్తే చిన్నపిల్ల దానికి ఏ పని చేతకాదు కదా?!" అంటే శ్రీబాబు, "నేను లేనా? ఎవరు ఎవరిని చూస్తారో నేను చూసుకోనా?" అని ఆవిడకి అభయం ఇచ్చారు. ఒక శనివారం గాలివాన వల్ల నరసమ్మగారు భీమవరం రాలేకపోయాను అని బాధపడుతుంటే ఆ రోజు కలలో శ్రీబాబు దర్శనం ఇచ్చి, "ప్రతి చిన్నది నేను చేస్తుంటే ఎందుకు బాధపడతావు నీకు ఏం భయం లేదు" అని ఆవిడ దుఃఖాన్ని తొలగించారు.

1970లో నరసమ్మగారికి ఆయాసం, దగ్గు ఎక్కువగా వచ్చేవి. డాక్టరుకు చూపిస్తే బ్రాంకైటిస్ అన్నారు. శ్రీబాబు భీమవరం వచ్చినప్పుడు ఆవిడ శ్రీబాబుకు విషయం చెబితే "గుంటూరు రా, మందిస్తాను" అని అన్నారు. ఆవిడ ఇంటికి వచ్చాక "అయ్యో, మందు కొరకు ఎప్పుడు రమ్మంటారో అడగలేదు" అని కాళిని శ్రీబాబు వద్దకు పంపించి అడిగితే, దానికి శ్రీబాబు నవ్వుతూ, "వారం లేని రోజున రమ్మను" అన్నారు. అలాగే ఏ మందు అవసరం లేకుండానే ఆవిడకి స్వస్థత చేకూర్చారు శ్రీబాబు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ హెడ్మాస్టర్ (వేదాంతం శ్రీనివాస అయ్యంగార్) గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

ఆ దివ్య స్పర్శతోను, ఆ అమూల్య ఆశీర్వచనంతోను విచలితులైన అయ్యంగారికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వారు లేచి, చేతులు కట్టుకొని నిలబడి "ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా తమ గురుకులంలో నా చేతనైనంత సేవ చేసుకోవాలని వచ్చాను బాబూ" అన్నారు. శ్రీ బాబు వారి చేతులు పట్టుకొని, "హెడ్మాస్టరు గారూ! మీ దగ్గర విద్యాభ్యాసం చేసిన వారు అఖండ ప్రజ్ఞావంతులౌతారు. నేను కూడా మీ దగ్గర పాఠాలు చెప్పించుకోవటానికి వస్తాను సార్" అన్నారు. హెడ్మాస్టరు గారు "తమ దివ్య పాద సన్నిధిలో ఉండి ఆధ్యాత్మిక విద్యలో ఓనమాలు నేర్చుకోగలిగినా, తమ అమూల్య ఆశీర్వచనం ప్రకారం నా జన్మ సఫలమౌతుంది బాబూ! ఈ శరీరంలో ఆఖరి రక్తపు బొట్టు మిగిలి ఉన్నంత వరకు తమ గురుకులంలో సేవ చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించండి" అని వేడుకున్నారు. ఆ క్షణం నుండి, తమ తుది శ్వాస విడిచే వరకు హెడ్మాస్టరుగారు తమ హృదయంలో శ్రీ బాబుకు తప్ప మరెవ్వరికి స్థానమివ్వలేదు; గురుకుల సేవ మానలేదు. ప్రధమ దర్శనంలోనే అటువంటి అచంచల పరిపూర్ణ గురుభక్తిని శ్రీ బాబు వారికి ప్రసాదించారు.



హెడ్మాస్టరుగారు మునుపు అనేక ప్రభుత్వోన్నత పాఠశాలలలో ప్రధానోపాధ్యాయునిగాను, స్కూళ్ళ యిన్స్పెక్టరుగాను చాల కాలం పని చేసి, విద్యా బోధనలో వున్నత ప్రమాణాలను నెలకొల్పి, పదవీ విరమణ చేశారు. వారు అంతరంగంలో పరమ భక్తులు. నలుగురు కుమారులు, ఏడుగురు కుమార్తెలు గల బహు కుటుంబీకులు. కర్తవ్య నిర్వహణమే, విధ్యుక్త ధర్మాచరణమే తమ ఊపిరిగా జీవించిన కర్మయోగులు. నిరాడంబరులు. వినమ్రులు. వారు శ్రీ బాబుతో గడిపిన కాలం మూడున్నర సంవత్సరాలే అయినా, శ్రీ బాబు దివ్య పాద ద్వయమునే తమ హృదయ ఫలకంపై శంఖ చక్రాంకిత ముద్రలుగా నిలుపుకుని శ్రీ బాబుకు అత్యంత ప్రియతములైనారు.

వారు వచ్చిన క్రొత్తల్లో, ఒక సత్సంగ సమావేశంలో శ్రీ బాబు వారిని "రాఘవాచార్యులుగారూ!"అని పిలిచారు. వారు లేవలేదు. "మిమ్మల్నేనండీ హెడ్మాస్టరుగారూ!" అన్నారు శ్రీ బాబు. హెడ్మాస్టరుగారు హడావిడిగా లేచి నిలబడి

నమస్కరించి, "క్షమించండి బాబూ! రాఘవాచార్యులు అని పిలిచేసరికి ఎవరినో అనుకుని లేవలేదు" అన్నారు. శ్రీ బాబు "ఓహో! తమ నామధేయం శ్రీనివాస అయ్యంగారు గదా! అయితే శ్రీనివాసుడికి, రాఘవుడికి భేదం ఉన్నదంటారా సార్?" అని అడిగారు. హెడ్మాష్టరుగారు "లేదు బాబూ!" అయితే యిప్పుడు తమలో ప్రకాశిస్తున్నది శ్రీనివాసుడా, రాఘవుడా?" అని అడిగారు శ్రీ బాబు. హెడ్మాష్టరుగారు దృఢంగా "ఏ నారాయణుడు శ్రీనివాసుడై, రాఘవుడై ప్రకాశిస్తున్నాడో ఆ నారాయణుడే శ్రీ గురురూపంలో నా యెదుటను, నా లోను ప్రకాశిస్తున్నాడు బాబూ!" అన్నారు. శ్రీ బాబు "వెరీ గుడ్! అయితే నేను మిమ్మల్ని రాఘవాచార్యులుగారనే పిలుచుకుంటాను" అన్నారు. హెడ్మాష్టరుగారు "మహాభాగ్యం బాబూ! అది నా ప్రియతమ గురుదేవులు నాకు ప్రసాదించిన నామధేయంగా స్వీకరిస్తాను" అన్నారు. అప్పటి నుంచి శ్రీ బాబు వారిని రాఘవాచార్యులు గారనే పిలిచేవారు. వెంటనే హెడ్మాష్టరుగారు పలికేవారు.

ఆశ్రమంలో సత్సంగ సమావేశాలు జరిగినా, సద్గురు పాదపూజలు జరిగినా, హెడ్మాష్టరుగారి మనస్సంతా అక్కడే ఉండేది. కాని స్కూలు జరిగే సమయంలో వారికి క్లాసులు లేకపోయినా వారెన్నడూ స్కూలు వదిలి రాలేదు. చరణదాసు గారనే భక్తులు గురుకులానికి బహూకరించిన శ్రీ బాబు పూర్తి సైజు ఫోటో ఒకటి వారి ప్రక్కనే ఉన్న బల్లమీద ఉండేది. మందహాస చంద్రికలతో అమృత వర్షమును, అభయ ముద్రతో అనుగ్రహ వర్షమును భక్తులపై కురిపిస్తున్న శ్రీ గురుదేవుల ఆ దివ్య మంగళ మనోహర మూర్తినే రెప్ప వాల్చక చూస్తూ, హెడ్మాష్టరుగారు "నా సత్సంగము, పూజ యిక్కడే నా బాబుతోనే జరుపుకుంటున్నాను" అనేవారు.

ప్రతిరోజు వారు స్కూలుకు వచ్చేసరికి ఉపాధ్యాయులు ఒకరు ఆ ఫోటోను శుభ్రంగా తుడిచి, పూలు, అగరువత్తులు సిద్ధంగా ఉంచేవారు. హెడ్మాష్టరుగారు రాగానే ముందుగా శ్రీ బాబుకు నమస్కరించి, మళ్ళీ తమ తృప్తికోసం రుమాలుతో ఫోటోను తుడిచి, పూలు అలంకరించి అగరువత్తులతో ధూపము వెలిగించి మళ్ళీ నమస్కరించి గాని, తమ కుర్చీలో కూర్చునేవారు కాదు. వారు ప్రతిరోజు గుంటూరు నుండి వచ్చేవారు. రైలులోగాని, అది అందకపోతే బస్సులో గాని వచ్చేవారు. కాని ఒక్క రోజైనా ఆలస్యంగా వచ్చేవారు కాదు. ఏ అనివార్యకారణం వల్ల అయినా కొద్ది నిమిషాలు ఆలస్యమైనా సరే, ఆ పూటకు సెలవు పెట్టి, తమ విధులను మాత్రం తప్పక నిర్వహించే వారు. "అంత స్వల్ప ఆలస్యానికి సెలవెందుకు?" అంటే, "ఉపాధ్యాయ సోదరులు నన్ను బట్టే నడుచుకుంటారు" అనేవారు. వారి యింట్లో పూజలు, శుభకార్యాలు ఏవి జరిగినా వారు మాత్రం సెలవు పెట్టేవారు కాదు. స్కూలు మానేవారు కాదు."ఈ మనస్సు శ్రీ బాబుకు అంకితం. ఈ తనువు గురుకులానికి అంకితం" అనేవారు. - సశేషం


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# భక్త పోతన

పోతన ఏమీ బదులు పలుకలేదు. ఆ తరువాత అందరూ భోజనాలు చేస్తున్నప్పుడు, దొడ్లో ఏదో పెద్ద చప్పుడైంది. దొడ్లోనుంచి పోతన కుమారుడు మల్లన్న అరిచాడు. “మామయ్యా! మీ అమ్మాయి నూతిలో పడింది” అని. అన్నం తింటున్న చేతితో శ్రీనాధుడు బయటకు వచ్చాడు. “అదేమిటి బావగారూ! అమ్మాయిని రక్షించటానికి ఏ పనిముట్టూ తేకుండా అన్నం తింటున్న చెయ్యి కడుక్కోకుండా ఆదుర్దాగా వచ్చారే! అమ్మాయిని ఎలా రక్షిద్దామను కొన్నారు?” అని అన్నాడు పోతన. ఇంతలో తన కూతురు క్షేమంగా ఉండటం చూసి స్థిమిత పడ్డాడు శ్రీనాధుడు. బావగారైన పోతన భక్తి పారవశ్యంలో వ్రాసిన ఆ పద్యం ఎంతో సమయోచితంగా ఉంది అని శ్లాఘించాడు.



అస్మద్ గురువరేణ్యులైన శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ వారు, యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీవారు, భక్త పోతనగారి భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలోని తత్త్వపూరిత పద్యాలను ఎన్నోసార్లు తమ బోధామృతాలలో పేర్కొన్నారు.

తాత్త్వికుడై, అపారమైన ఆత్మగౌరవంతో జీవితం గడిపాడు పోతన. అతడు మహా పండితుడు వినయవంతుడు. పోతనకు నివాళులర్పిస్తూ ఒక కవి “ఎలా వచ్చిందయ్యా నీ కవితలలో ఇంత తీయదనము, చక్కెరలో ఘంటాన్ని ముంచి వ్రాశావా” అని అన్నారు, పోతన భక్తితో రంగరించిన తీయని పద్యాలలోని రస మాధురిని ఆస్వాదిస్తూ.

**భాగవత మహిమ –**

> **నిగమములు వేయి చదివిన**
> **సుగమంబులుగావు ముక్తి సుభాగత్వంబుల్**
> **సుగమంబు భాగవతమను**
> **నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా!**

"మహాత్మా! ఎన్ని వేదాలు చదివినా అవి సులభంగా ముక్తిని ప్రసాదింపవు. 'భాగవతము' అనే వేదమును భక్తితో పఠిస్తే మోక్షం కొంగు బంగారమే అవుతుంది. ఏలనన శ్రీమద్భాగవతము ముక్తి ధామము."

బమ్మెర పోతన మహా భాగవతాన్ని తన మధుర ధారతో తెలుగులో అనువాదం చేసి, తెలుగువారిని తరింప చేయటానికై అవతరించిన కారణ జన్ముడు. తెలుగు వారి సౌభాగ్య ఫలము.

గురువుని కేవలం మానవ మాత్రునిగా భావించరాదు. భగవానుని దివ్యజ్యోతిని సద్గురువులో దర్శించవచ్చు. సద్గురువే భగవంతునిగా దివ్యపరివర్తన చెందటం ఊహాతీతమైన ఒక అద్భుత లీల! లీలా మానుష రూపం దాల్చిన సద్గురువు తనపట్ల అచంచల విశ్వాసం నిలుపుకున్న వాళ్ళకి సకల శుభాలు అనుగ్రహిస్తాడు. మానవునికి భగవంతునికి మధ్యన అనుసంధాన కర్త సద్గురువే!

- శ్రీ కాళీబాబు

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## 2026 జనవరి 8 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు గుండుగొలను శ్రీ కాళీవనాశ్రమం శాఖలో జరిగిన శ్రీ బాబూజీవారి క్షీరశిలా విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ సత్సంగ దృశ్యములు







స్వామి నిత్యతృప్తదాసు



REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## 2026 జనవరి 29 వ తేదీ నుండి ఫిబ్రవరి 3 వ తేదీ వరకు పెదనింద్రకొలను శ్రీ కాళీవనాశ్రమం శాఖలో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యములు








If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.